ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
మంగళవారం 5 నవంబరు 2024



ప్రాణాలు తీసిన ఫ్లెక్సీ
7





హరోంహర

కార్తీక మాసం.. తొలి సోమవారం.. జిల్లాలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. భీమవరం సోమేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. 6లో..

గూడెంలో విమానాశ్రయం!

- కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు
- 1,200 ఎకరాలు ఇచ్చేందుకు సిద్ధం
- పరిశీలనలో అటవీ, ప్రైవేట్ భూములు
- కేంద్రం ఆమోదిస్తే ముందుకు..
- గతంలోనే చంద్రబాబు పరిశీలన

6



ఆవిరైన.. ఆనందం

- సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ ఫ్లెక్సీ కడుతుండగా విద్యుదాఘాతం.. నలుగురు యువకుల దుర్మరణం
- ఒకరికి తీవ్రంగా.. ఇద్దరికి స్వల్పంగా గాయాలు
- తాడిపర్రులో వేకువజామున విషాదం.. కన్నీరు మున్నీరైన ఊరు
- పోటా పోటీ ఫ్లెక్సీలే ఉసురు తీశాయా ? వీటి తొలగింపునకు చర్యలు.. గ్రామంలో 144 సెక్షన్ ఏర్పాటు
- మంత్రి దుర్గేష్, తూర్పు గోదావరి కలెక్టర్ ప్రశాంతి పరామర్శ..
- మృతుల కుటుంబాలు ఒక్కొక్కరికి రూ.5 లక్షల సాయం

టెట్ ఫలితాలు వచ్చేశాయ్..



రేపు డీఎస్సీ నోటిఫికేషన్

- ఉమ్మడి జిల్లాలో 1,035 ఉపాధ్యాయ ఖాళీలు
- కోచింగ్ సెంటర్ల బాట పట్టిన అభ్యర్థులు

భీమవరం ఎడ్యుకేషన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): టెట్ ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఈ నెల 6న విడుదల కానుంది. దీంతో అభ్యర్థులు ప్రిపరేషన్‌పై దృష్టి పెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీని తీసుకువచ్చింది. జిల్లాల వారీగా ఉపాధ్యాయుల ఖాళీల సంఖ్య నిరుద్యోగులకు ఆశాజనకంగా ఉండటంతో మెగా డీఎస్సీ ఆకర్షణగా మారింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 1,035 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఉన్నాయి. వీటిని సబ్జెక్టుల వారీగా భర్తీ చేయాల్సి ఉంది. గత నెల 5 నుంచి 21వ తేదీ వరకు టెట్ నిర్వహించారు. పరీక్ష ముగిసిన 14 రోజుల్లోనే టెట్ ఫలితాలు విడుదల చేశారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటి కల్లా ఖాళీ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసే ఆలోచనలో ఉన్నారు. ఆ లెక్కన 2025-26లో పూర్తిస్థాయి ఉపాధ్యాయులతో ప్రభుత్వ పాఠశాలలు ముందు సాగనున్నారు.

లాంగ్‌టర్మ్ కోచింగ్‌లో నిరుద్యోగులు

మెగా డీఎస్సీ రెడీ అని కూటమి ప్రభుత్వం మాటతో ఏళ్ల తరబడి ఉపాధ్యాయ ఉద్యోగం చేరాలనుకున్న నిరుద్యోగులు కోచింగ్ బాట పట్టారు. ఐదేళ్లపాటు మూలపడ్డ కోచింగ్ సెంటర్లు మళ్లీ తెరుచుకున్నాయి. జిల్లా కేంద్రమైన భీమవరంతోపాటు ప్రధాన పట్టణాల్లో సుమారు 70కు పైగా కోచింగ్ సెంటర్లు అందుబాటులో వచ్చాయి. టెట్ వరకు దానికి శిక్షణ పొందారు. అది ముగిశాక డీఎస్సీ శిక్షణలో పడ్డారు. బ్యాచ్‌లు వారీగా వేల మంది మెగా డీఎస్సీ కోచింగ్ తీసుకుంటున్నారు. ఎక్కువ వ్యవధి ఉండటంతో లాంగ్ టర్మ్ కోచింగ్‌పైనే దృష్టి పెట్టారు.



ఎర్ర కాల్వకు ఎర

ఇసుక మాఫియా ఎర్ర కాల్వకు ఎర వేసింది. ర్యాంపు వేసి మరీ అర్ధరాత్రి వేళ ఇసుకను అక్రమంగా తరలిస్తోంది. డ్రెయిన్‌కు అవసరమైన ఇసుకను తరలించేందుకు అనుమతి తీసుకున్నామని చెబుతూనే.. పెద్ద సంఖ్యలో ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. షాకింగ్ విషయం ఏమిటంటే ఈ ఇసుక కట్టడాలకు పనికిరాదు.. ఫిల్లింగ్‌కు మాత్రమే దీనిని ఉపయోగిస్తారు. 6లో..

ఆకివీడు రాజకీయం.. రసవత్తరం



ప్రభుత్వం మారినా వైసీపీ పాలనేనా..?

- టీడీపీ, జనసేన కౌన్సిలర్ల ఆవేదన.. కౌన్సిల్ సమావేశానికి గైర్హాజరు !
- ఎమ్మెల్యే రఘురామకు చెప్పినా పట్టించుకోలేదని విమర్శ



ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఆకివీడు టీడీపీ, జనసేన కౌన్సిలర్లు

ఆకివీడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆకివీడు నగర పంచాయతీ రాజకీయం ఆసక్తికరంగా మారింది. 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలపై సోమవారం నగర పంచాయతీ కార్యాలయంలో అత్యవసర కౌన్సిల్ సమావేశం జరిగింది. దీనికి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు హాజరయ్యారు. అయితే 13 మంది వైసీపీ కౌన్సిలర్లకు ముగ్గురు హాజరుకాలేదు. టీడీపీ, జనసేన కౌన్సిలర్లు హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది. అంతకంటే మించి ఎమ్మెల్యే రఘురామ తమను పట్టించుకోలేదని ఇక్కడకు వచ్చిన టీడీపీ, జనసేన క్యాడర్ తిరిగి వెళ్లిపోవడం మరింత ఆసక్తికరంగా మారింది. పార్టీని అంటిపెట్టుకున్నందుకు తమకు ఎమ్మెల్యే తగిన బుద్ధి చెప్పారని పలువురు శ్రేణులు వాపోయారు. మరోవైపు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినా ఆకివీడులో మాత్రం వైసీపీ పాలనే కొనసాగుతోందని టీడీపీ, జనసేన కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇరు పార్టీల కౌన్సిలర్లు బొల్లా వీరశ్వేత, కిమిడి అరుణ కుమారి, బత్తుల శ్యామల, మోపిదేవి సత్యవతి, గోపిశెట్టి వెంకట సత్యవతి, గుర్రాన నాగలక్ష్మి, నేరెళ్ళ ప్రసన్న మాట్లాడుతూ 'నగర పంచాయతీ చైర్మన్ అధికార యంత్రాంగాన్ని చెప్పుచేతల్లో పెట్టుకొని పాలన సాగిస్తున్నారు. టీడీపీ, జనసేన కౌన్సిలర్ల వార్డుల్లో అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ, జనసేన కౌన్సిలర్లతో వార్డుల్లో అభివృద్ధికి కొబ్బరికాయ కొట్టించలేదు. ఎమ్మెల్యే మంతెన రామరాజుకు ప్రొటోకాల్ పాటించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చినా తమకు అదేవిధంగా జరుగుతోంది' అని వాపోయారు.

ఆక్రమణల తొలగింపులో అడ్డుపడొద్దు : ఎమ్మెల్యే

ఆకివీడు అభివృద్ధికి పార్టీలతో సంబంధం లేకుండా సహకరించాలని ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. నగర పంచాయతీ చైర్మన్ జామి హైమావతి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఆకివీడు మండలంలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉంది. ఇటీవల దుంపగడపలో, నేడు అయి-భీమవరంలో మంచినీటి సమస్యతో తీవ్ర విషజ్వరాలతో జనం అల్లాడుతున్నారు. వాటిని నివారించేందుకే కాలువలు, చెరువులు బోదెల చుట్టూ ఆక్రమణలు తొలగిస్తున్నాం. నాకు ఎవరి మీద వ్యక్తిగత కక్ష లేదు. పట్టణాభివృద్ధికి కృషి చేస్తున్నా. ఆక్రమణల తొలగింపు సమయంలో రాజకీయ నాయకులు అడ్డుపడవద్దు. అర్హులుంటే పట్టాలు ఇస్తాం. గంగానమ్మకోడ్ ప్రాంతంలో ఆక్రమణలు పరిశీలించి, వారంలో తొలగించాల'ని అన్నారు. కమిషనర్ జి.కృష్ణమోహన్, పాల్గొన్నారు.



గంగానమ్మకోడ్ దగ్గర ఆక్రమణలు తొలగించాలని కిరాణా వర్తకుడికి తెలియజేస్తున్న ఎమ్మెల్యే రఘురామ

ఇళ్ల తొలగింపులో ఘర్షణ

పోలీసులు, బాధితుల మధ్య తోపులాట.. రోడ్డుపై బైఠాయింపు

అధికారుల తీరుపై సీపీఎం నాయకుల మండిపాటు

ఆకివీడు రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆకివీడు మండలం అయి భీమవరం రోడ్డులోని ఇరిగేషన్, రోడ్డు పోరంబోకులో వున్న 119 ఇళ్ల తొలగింపును బాధితులు, సీపీఎం నాయకులు అడ్డుకున్నారు. రోడ్డుపై బైఠాయించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాలవ్యవధి ఇవ్వకుండా ఇళ్లను తొలగిస్తే సహించేది లేదని మండిపడ్డారు. 'స్థలాలు సేకరించిన చోట మౌలిక వసతులు కల్పించలేదు. రోడ్లు, తాగు నీరు, కరెంటు, డ్రైనేజీ సౌకర్యం లేదు. చాలా మందికి స్థలాలు కేటాయించలేదు. మౌలిక వసతులు కల్పించకుండా ఇళ్లు ఖాళీ చేసి ఎక్కడ ఉండాలి' అని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కాల వ్యవధి ఇవ్వాలని కోరారు. అప్పటి వరకు వెళ్లేది లేదని బైఠాయించారు. దీంతో పోలీసులకు సీపీఎం నాయకులు, బాధితులకు ఘర్షణ వాతావరణ నెలకొంది. తోపులాట జరగడంతో తులసి అనే మహిళ స్పృహ తప్పి పడిపోయింది. ఆమెను ఆకివీడు ఆసుపత్రికి తరలించారు. 50 రోజుల క్రితమే నోటీసులు అందించినట్లు అధికారులు చెబుతున్నారు. తెలియజేస్తున్నారు. పెంకి అప్పారావు, కె.తవిటనాయుడు, డి.రవితేజ, ఎస్.కుమారి, బి.రాంబాబు, జి.లావణ్య, బీవీ వర్మ, సర్కార్, ఎస్.అప్పన్న పాల్గొన్నారు.

ఏలూరు మెనూనే అనుసరణీయం !

ఏలూరు అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి):మధ్యాహ్న భోజన పథకంలో అమలవుతున్న ఆహార పదార్థాలు ఎక్కువ మంది విద్యార్థులకు రుచించకపోవడంతో మెనూలో మార్పులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల డీఈవోలు, విద్యా శాఖ బృందాలు, భోజన పథకం కార్మికులతో సమావేశం నిర్వహించారు. సాంబారులో అన్నం కలిపి వడ్డిస్తున్న భోజనాన్ని పిల్లలు తినడానికి ఇష్టపడడం లేదని, అల్పాహారంగా తీసుకునే పులిహోరను ఎక్కువ పరిమాణంలో భోజనంగా తినేందుకు అయిష్టత చూపుతున్నట్టు తేల్చి చెప్పారు. విద్యార్థులు ఇష్టపడే వంటకాలతో కూడిన మెనూని ప్రతిపాదిస్తూ కలెక్టర్ వెట్రిసెల్వి ఆమోదం తీసుకుని ఏలూరు జిల్లా తరపున నివేదించారు. ఈ మెనూనే సోమవారం విజయవాడలో నిర్వహించిన డీఈవోల సమావేశంలో దాదాపు ఖరారు చేశారు.



కలెక్టర్ నాగరాణికి వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘాల నాయకులు

నీటి సంఘాల ఎన్నికల్లో కౌలు రైతులకు ఓటు హక్కు కల్పించాలి

భీమవరం ఎడ్యుకేషన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):నీటి సంఘాల ఎన్నికల్లో కౌలు రైతులకు ఓటు హక్కు కల్పించాలని, పంట రుణాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘాల నాయకులు కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి రైతు సంఘాలు వినతి పత్రం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయం అంతా కౌలు రైతులే సాగు చేస్తున్నారని చెప్పారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ సాగు నీటి సంఘాల ఎన్నికలలో కౌలు రైతులు ఓటు హక్కు కల్పిస్తామన్నారు. పంట నష్టపరిహారం వచ్చేలా రాష్ట్ర అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు.కేతా మోహనరావు, బండి శ్రీనివాస్, కుడిపూడి విష్ణుమూర్తి, కడలి సత్యనారాయణ పాల్గొన్నారు.

ధాన్యం.. ధరహాసం

నాలుగు గంటల్లోనే రైతుల ఖాతాలకు సొమ్ము

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధాన్యం తూచిన రైతులకు నాలుగు గంటల్లోనే సొమ్ములు జమ అవుతుండటంతో వారి ఆనందానికి అవధుల్లేవు. గత ప్రభుత్వ హయాంలో నెలల తరబడి ధాన్యం సొమ్ముల కోసం ఎదురుచూసేవారు. ఇప్పుడు కూటమి సర్కారు రైతులకు సకాలంలో సొమ్ములు వేస్తూ వారికి ఆసరాగా నిలుస్తోంది. పంట పెట్టుబడి, అప్పులు తీర్చుకునేందుకు ఇదెంతో దోహదపడుతుందని భావిస్తున్నారు. రానున్నది మంచి రోజులని భావిస్తున్నారు. తాడేపల్లిగూడెం మండలం కృష్ణాయపాలెంకు చెందిన రైతులు దేవళ్ల సుబ్బారావు 117 బస్తాలు ధాన్యం కొనుగోలు కేంద్రానికి సోమవారం తూచిన నాలుగు గంటల్లోనే ఖాతాలో రూ. లక్షా ఏడు వేల 640 జమయ్యాయి. అతని భార్య వరలక్ష్మి పేరున 159(40 కేజీల) బస్తాల ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించారు. ఆమె ఖాతాలో రూ.లక్షా 46 వేల 280 జమయ్యాయి. పెద తాడేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించిన రైతులకు తూసిన 12 గంటల్లోనే జమ కావడంతో ఆ ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సొమ్ములు వేయడానికి సిద్ధం

జిల్లాలో నాలుగు లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకూ 200 టన్నులు కొనుగోలు చేశారు. సొమ్ము సిద్ధంగా ఉంచి మరీ కొనుగోలు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. రూ.20 కోట్ల వరకూ మిల్లర్లకు అందించారు. ప్రభుత్వం క్వింటాకు రూ.2,300 కనీస మద్దతు ధర అందించేందుకు 17 తేమశాతం కనిష్ఠంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. కానీ తేమ శాతంలో కొంత వెసులుబాటు కల్పిస్తున్నారని రైతులే చెబుతున్నారు. ప్రస్తుతం రైతులు తూసే బస్తాలు 40 కేజీల బస్తాలకు మద్దతు ధరకు అనుగుణంగా అందిస్తున్నారు.



'ధాన్యం తూచిన నాలుగు గంటల్లోనే సొమ్ము జమ కావడం ఎంతో ఆనందంగా ఉంది. ఇదే పరిస్థితి కొనసాగిస్తే రైతులకు అప్పుల వాళ్ల నుంచి ఒత్తిడి తగ్గుతుంద'ని రైతు దేవళ్ల సుబ్బారావు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 'తాడే పల్లిగూడెం మండలంలో తొలి ధాన్యం కొను గోలు కేంద్రాలను ప్రారంభించాం. ఇప్పటికే 124.5 టన్నులు కొనుగోలు చేసి సొమ్ములు జమ చేశాం. రాబోయే కాలంలో రైతులకు 48 గంటల్లోపు సొమ్ము అందించేందుకు సిద్ధంగా ఉన్నాం' అని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్ ప్రసాద్ చెప్పారు.



నరసాపురంలో రోడ్డుపై బైఠాయించిన ప్రజలు

మద్యం షాపులు కళకళ.. బార్లు విలవిల!

నివాసాల మధ్య మద్యం షాపులు వద్దంటూ ఆందోళనలు

7

- షాపులలోనే బ్రాండెడ్ మద్యం లభ్యం.. బార్లకు తగ్గిన వ్యాపారం
- మొన్నటి వరకు బార్లలో ధరల దరువు.. ఇప్పుడు పోటీగా బ్రాందీ షాపులు

ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలి

కలెక్టర్ నాగరాణి : 209 అర్జీలు స్వీకరణ

భీమవరం టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి అందే అర్జీలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లుతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక-మీకోసం కార్యక్రమంలో 209 అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన అర్జీలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. అర్జీదారునికి అర్థమయ్యే రీతిలో సమాధానాన్ని రిజిస్టర్ పోస్టు ద్వారా, వాట్సాప్ ద్వారా పంపాలన్నారు. కోర్టు కేసుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ఎప్పటికప్పుడు దాఖలు చేయాల్సి ఉంటుందన్నారు. రీ ఓపెన్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- మంచినీటి చెరువు నుంచి ఫిల్టర్ బెడ్‌ల ద్వారా శుద్ధి చేసి విడుదల చేయాల్సిన తాగునీటిని కుళాయిల ద్వారా నేరుగా వదులుతున్నారని పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాలకు చెందిన కె.శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు.
- కొంత మంది స్వార్థపరులు వల్ల గ్రామంలోని మంచినీటి కలుషితమై ప్రజలకు ఉపయోగం లేకుండా ఉందని కాళ్ల మండలం ఏలూరుపాడుకు చెందిన జి.అంజనేయులు తెలిపారు.
- పేదలకు నిర్మిస్తున్న గృహ సముదాయ స్థలాన్ని చదును చేశామని, ఈ బిల్లు త్వరితగతిన ఇప్పించాలని నరసాపురం మండలం సీతారాంపురానికి చెందిన చెరుకూరి సత్య వరప్రసాద్ రాజు కోరారు.
- నిరుపేద ఎస్సీ వర్గానికి చెందిన తనకు స్థలం ఇచ్చి, ఇంటిని నిర్మించి ఇవ్వాలని తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన తుపాకుల మౌనిక కోరారు.
- మురుగు కాలువ గట్టును ఆక్రమించుకుని కొందరు గుడిసెలు వేసుకోవడంతో పండించిన ధాన్యాన్ని తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నామని పెంటపాడు మండలం పరిమలకు చెందిన కేవీఎన్ ఆచార్యులు, కేవీ రాఘవాచార్యులు తెలిపారు.

ఉండి పోలీసు స్టేషన్ ప్రారంభం - 8లో..



14 ఫిర్యాదులు

భీమవరం క్రైం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని అదనపు ఎస్పీ భీమారావు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు భూవివాదాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక లావాదేవీలు, మోసాల వంటి పలు సమస్యలపై 14 మంది విన్నవించుకున్నారు. వీటిని పరిష్కరించాలని ఏఎస్పీ ఆదేశించారు.

పుట్టలోని నాగన్నా.. పూజలందుకోవయ్యా

నేడు నాగుల చవితి



కామవరపుకోట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : దీపావళి అమావాస్య తరువాత వచ్చే కార్తీక శుద్ధ చవితిని నాగుల చవితి అంటారు. ఇది మహిళల పండుగ. పవిత్ర అర్చనలు సమర్పించే నాగులచవితి. సహజంగా ఊరి పొలిమేరల్లో ఏర్పడే పుట్టలలో నాగేంద్రునికి పాలుపోసి పూజలు చేస్తారు. ఈ రోజున సూర్యోదయానికి పూర్వమే నిద్ర మేల్కొని తలారా స్నానం చేస్తారు. నూతన వస్త్రాలు ధరించి నాగులకు ఇష్టమైన ఆవుపాలు, కోడిగుడ్లు, పూజా సామాగ్రి, చలివిడి, వడపప్పు, ప్రసాదం తయారు చేసుకుని ఇంటిల్లిపాదీ దగ్గరలో ఉన్న పుట్ట వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. కన్నె పిల్లలు, సంతానం కావాల్సిన మహిళలు భక్తి శ్రద్ధలతో పూజిస్తే మంచి భర్త, శుభప్రదమైన సంతానం కలుగుతుందని ప్రతీతి. చిన్నపిల్లలు దీపావళి నాటి మిగిలిన బాణసంచా పుట్ట వద్ద కాలుస్తారు. కుజ రాహు దోషాలు ఉన్నవారు, సంసారిక బాధలు ఉన్నవారు సుబ్రహ్మణ్యేశ్వర పూజను కార్తీకంలో నిర్వహిస్తే బాధలు తీరుతాయి. షష్ఠి, చతుర్థశిలలో మంగళవారం కాని, చతుర్థశి బుధవారం కలిసొచ్చే రోజునగాని నాగులకు పాలు పోసి నాగపూజ అశ్వర్థ నారాయణ ప్రదిక్షణలు చేయాలి. ఈ విధంగా చేసిన వారి దోష నివారణ కలిగి సుఖ సంతోషాలతో వర్ధిల్లుతారని పురాణాలు తెలియజేస్తున్నాయి. జేష్ఠ నక్షత్రం వృశ్చిక రాశిలోనిది. దీనికి సర్ప నక్షత్రమని పేరు. ఈ సర్ప నక్షత్రంలో సూర్యుడు ప్రవేశించుట వల్ల నాగులచవితి పండుగ చేసుకుంటాం. శరీరంలో ఉన్న పామును ఆరాధించడమే నాగులచవితి. శరీరమే వల్మీకం.. పుట్టలో అడుగున మూలాధారంలో శయనించి ఉండే నాగమే కుండలినీ శక్తి. దీని విషాన్ని హరించే సత్యగుణమనే పాలుపోసే సాధన రహస్యమే నాగుల చవితి అని పురాణాలు తెలియ చేస్తున్నాయి.

హర..హర మహాదేవ

శివనామ స్మరణతో మారుమోగిన ఆలయాలు

శైవ క్షేత్రాల్లో కార్తీక సోమవార శోభ



క్షీరా రామలింగేశ్వరస్వామికి అభిషేకం

భీమవరం టౌన్/పాలకొల్లు అర్బన్ /పోలవరం నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం మొదటి సోమవారం శైవక్షేత్రాలు శివనామ స్మరణతో మారుమోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులకు ఆలయాలకు పోటెత్తారు. మహిళలు కాల్వలు, నదీతీరాల్లో కార్తీక దీపాలను వదిలారు. పంచారామ క్షేత్రమైన గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు చెరుకూరి రామకృష్ణ ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు 25 వేలకు పైగా భక్తులు వచ్చారు. వెంపకు చెందిన గొట్టుముక్కల భీమరాజు అన్న ప్రసాదం అందించారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ప్రారంభించారు. విరాళాలు, ప్రసాదాల అమ్మకాల ద్వారా దేవస్థానానికి 5 లక్షల 30 వేల 104 రూపాయలు ఆదాయం వచ్చిందని ఈవో రామకృష్ణం రాజు తెలిపారు. జంక్షన్ రైల్వేస్టేషన్ నుంచి పంచారామ బస్సుల వద్దకు భక్తులను చేరవేసేందుకు ఉచితంగా ఆటోలను ఏర్పాటు చేశారు. వన్‌టౌన్ సీఐ నాగరాజు ఏర్పాట్లును పర్యవేక్షించారు.

పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామిని సుమారుగా 35 వేల మంది వరకూ దర్శించుకున్నట్టు ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు తెలిపారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.ఆలయం సమీపంలోని రేపాక వారి సత్రంలో భక్తులు ఆరు వేల మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. లంకలకోడేరు, మేడపాడు పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో భక్తులకు అవసరమైన వైద్య సేవలు అందజేశారు.

హర హర మహాదేవ శంభో శంకర.. శివ నామస్మరణతో పట్టిసాచల శివక్షేత్రం మారుమోగిపోయింది. పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామిని దర్శించుకునేందుకు తెల్లవారు జామున 4 గంటల నుంచి రద్దీ ఆరంభమైంది. పట్టిసీమ ఫెర్రీ రేవులో నదీ తీరంలో ఇసుకతిన్నెల వద్ద పుణ్య స్నానాలు చేసిన భక్తులు నదిలో కార్తీక దీపాలు వదిలారు.ఆలయ ప్రాంగణంలో ఉన్న భద్రకాళీ, తాండవ భద్రుడు, కాలభైరవుడు, ఆదిత్యాది నవగ్రహాలు, లక్ష్మీ గణపతి, సరస్వతి, కేశవ స్వామి ఆలయాలను దర్శించి పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ సిబ్బంది మంచినీరు, అల్పాహారాలు, అన్నదానం నిర్వహించారు. ఈవో చాగంటి సురేష్ నాయుడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



పట్టిసీమ వీరేశ్వరస్వామి, పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో పూజలు



గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయంలో దీప పూజలు



ఎర్రకాలువలో ఎక్స్‌కవేటర్...ఇసుక ట్రాక్టర్‌లు

అర్ధరాత్రి ఇసుక దోపిడీ

ఎర్రకాలువకు ర్యాంపు వేసి మరీ..

ట్రాక్టర్లపై భారీగా తరలింపు

అనుమతి ఉందంటూ దబాయింపు

తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం, నల్లజర్ల మండలాల్లో ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. రాత్రి సమయంలో ఎర్రకాలువకు ర్యాంపులు వేసి మరీ ఇసుక దోచే స్తున్నారు. తాడేపల్లిగూడెం మండలం పట్టింపాలెం, వీరంపాలెంతో పాటు సరిహద్దులో ఉండే నల్లజర్ల మండలం గుండేపల్లి ప్రాంతం నుంచి ఇసుక తరలిస్తున్నారు. గురువారం రాత్రి దీపావళి అదను చూసి మరీ నల్లజర్ల మండలం, తూర్పు చోడవరానికి చెందిన వారు తహసీల్దార్ అనుమతి ఇచ్చా రంటూ ఓ జేసీబీ తీసుకొచ్చి ర్యాంపు వేసి మరీ ట్రాక్టర్‌లతో ఇసుక తరలింపు చేపట్టారు. దీంతో ఆ పక్కన ఉన్న రైతులు తమ పంతలు దెబ్బతింటాయని అడ్డుకునే ప్రయత్నం చేసినా వినలేదు. తూర్పుచోడవరంలో డ్రైయిన్ నిర్మాణం కోసం అంటూ ఆర్డర్ కూడా తీసుకు రావడం విమర్శలకు తావిస్తోంది. మూడు ట్రాక్టర్‌లకు అనుమతి ఆ లేఖలో అనుమతి ఉండగా పదుల సంఖ్యలో ట్రాక్టర్‌లలో ఇసుక నింపుకుని మరీ తరలించారు.

ఎర్రకాలువ ఇసుకతో నిర్మాణాలా..!

ఎర్రకాలువ ఇసుకతో నిర్మాణాలు చేపట్టడం అంటే నాణ్యతకు తిలోదకాలు ఇవ్వడమే. అంటే ఈ ఇసుకలో ఇసుకతో పాటు మట్టి కలిసి ఉంటుంది. ఈ ఇసుకను పూడికలకు తప్ప వేరే నిర్మాణాలకు వాడకూడదు. కానీ తహసీల్దార్ పేరుతో ఇచ్చిన అనుమతిలో మాత్రం డ్రైయిన్ నిర్మాణం కోసం వాడు కోవాలంటూ ఉంది. అయితే అధికారులే నాణ్యతతో సంబంధం లేకుండా ఇసుక తరలించుకోవాలంటూ ఆదేశాలిస్తున్నారా అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆ గ్రామాల ద్వారానే దందా..

నల్లజర్ల మండలం గుండేపల్లి, తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం, పట్టింపాలెం గ్రామాలలో ఇటీవల ఇసుక కొరత ఏర్పడటంతో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. ఎర్రకాలువ ఇసుక దోచి ట్రాక్టర్‌ల ద్వారా గట్టుపైకి ఇసుక తెచ్చి వాటిని పెద్ద లారీల్లో లోడు చేసి లారీ రూ.20 వేల వరకూ విక్రయిస్తున్నారు. ఈ దందా మొత్తం రాత్రి వేళల్లోనే సాగుతోంది. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ సిబ్బంది మామూళ్లకు అలవాటు పడి ఆ మాఫియాకు సహకరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఆందోళనలో రైతులు

ఎర్రకాలువలో ఇసుక తరలించడంతో ఆ గట్లు గుల్ల అవుతుడటంతో రైతులు బయటకు రావాలంటే ఇబ్బంది పడే విధంగా ఎర్రకాలువ గట్లు తయారయ్యాయి. ఇప్పటికే పలుమార్లు గట్ల మరమ్మతులు చేపట్టినా ఈ ఇసుక మాఫియా ఆగడాల వల్ల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అడ్డుకునే రాత్రి సమయంలో ఈ దోపిడీ చేస్తుండడంతో రైతులు వారిని అడ్డుకునేందుకు సమయం దొరకడం లేదు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

క్రాస్ కంట్రీ రన్నింగ్ పోటీలకు భీమడోలు విద్యార్థి



భీమడోలు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : భీమడోలు వేంకటేశ్వర డిగ్రీ కళాశాల బీఏ మొదటి సంవత్సరం విద్యార్థి సాయిరామ్ రాష్ట్రస్థాయిలో ఇంటర్ యూనివర్శిటీ పది కిలోమీటర్ల క్రాస్ కంట్రీ రన్నింగ్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈనెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ మంగుళూరు ఆల్వాస్ కళాశాలలో జరిగే జాతీయస్థాయి యూనివర్శిటీ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించాడు.



తాడేపల్లిగూడెంలో విమానాశ్రయం!

కేంద్రానికి రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదనలు

1200 ఎకరాలు ఇచ్చేందుకు సిద్ధం

పరిశీలనలో అటవీ, ప్రైవేట్ భూములు

కేంద్రం ఆమోదిస్తే ముందుకు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తాడేపల్లిగూడెంలో విమానాశ్రయం నిర్మించేందుకు రాష్ట్రప్రభుత్వం సుముఖత చూపింది. కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెంలో ఏదో ఒకచోట విమాన శ్రయం ఏర్పాటు చెయ్యటానికి సంకల్పించారు. జాతీయ రహదారులు, ప్రధాన రైల్వేమార్గం ఉభయ పశ్చిమగోదావరి నడిబొడ్డున ఉండటంతో తాడేపల్లిగూడెం అనుకూలంగా ఉంటుందని భావిస్తోంది. దానికి తోడు తాడేపల్లిగూడెంలో భూసేకరణ సులభతరం కానుంది. విమానశ్రయ నిర్మాణానికి మెట్టభూమి ఉంది. ఇవన్నీ తాడేపల్లిగూడెంలో విమానశ్రయానికి అనుకూలంగా కలసి వస్తున్నాయి. జాతీయ, రాష్ట్రస్థాయి విద్యాసంస్థలు కూడా ఇక్కడే ఉన్నాయి. దేశవ్యాప్తంగా వందలమంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఉద్యానవన విశ్వవిద్యాలయాలు, ఉండటంతో విమానశ్రయానికి ప్రాధాన్యం ఏర్పడింది. శ్రీలంక, మయన్మార్, ఇండోనేషియా, థాయిలాండ్, బంగ్లాదేశ్, భూటాన్, తదితర దేశాలు విద్యార్థులు ఏపీ నిట్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. అన్ని రాష్ట్రాల విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరి రాకపోకలకోసం విమానాశ్రయం అనుకూలంగా ఉంటుంది. మరో వైపు మెట్టప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ప్రణాళికతో ఉంది. ఇవన్నీ నెరవరేలాంటే విమానశ్రయం ఏర్పాటు కావాలని రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది.

గతంలోనే ప్రకటన..

వాస్తవానికి గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడు చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో తాడేపల్లిగూడెంలో విమానాశ్రయం నెలకొల్పనున్నట్లు ప్రకటించారు. పౌర విమానయాన శాఖ అధికారులు కూడా తాడేపల్లిగూడెంలోని విమానాశ్రయ భూములను పరిశీలించారు. రన్‌వే ప్రణాళికలను కూడా సిద్ధం చేసుకున్నారు. ఐతే అవే భూముల్లో ఏపీ నిట్ నెలకొల్పారు. దీంతో విమానాశ్రయ ప్రతిపాదన మరుగునపడిపోయింది. తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత మళ్లీ తెరపైకి వచ్చింది. కొద్దిరోజుల క్రితమే కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కె.రామ్మోహన్‌రాయుడు తాడేపల్లిగూడెంలో విమానాశ్రయాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రానికి ప్రతిపాదనలు వెళ్ళాయి. కేంద్రం ఆమోదం తెలిపితే భూ సేకరణకు సిద్ధం కానున్నారు.

అందుబాటులో అటవీ భూములు

తాడేపల్లిగూడెం సమీపంలోని వెంకట్రామన్న గూడెం వద్ద అటవీ భూములు అందుబాటులో ఉన్నాయి. దాదాపు మూడువేల ఎకరాలు విస్తరించి ఉన్నాయి. తెలుగుదేశం ప్రభుత్వం గతంలో డీనోటిపై చెయ్యాలని నిర్ణయించింది. అది ఆమోదం పొందాలంటే కేంద్రం ఆమోద ముద్ర వెయ్యాలి. అంతకు మూడు రెట్లు భూమిని అటవీ శాఖకు రాష్ట్ర ప్రభుత్వం బదలాయించాల్సి ఉంటుంది. రాయలసీమలో వేలాది ఎకరాల రెవెన్యూ భూమి ఉంది. సదరు భూములు అటవీ శాఖకు కేటాయించాలని గతంలో నిర్ణయించింది. అప్పట్లో ఆ ప్రతిపాదనలు నెరవేరలేదు. తాజాగా విమానశ్రయ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అనుకూలంగా ఉండటంతో అందరూ దృష్టి అటవీ భూములపై పడింది..అది సాధ్యం కాకపోతే ప్రైవేట్ భూములు సేకరించాల్సి ఉంటుంది.

జిల్లా స్థాయి చదరంగ పోటీల విజేతలు



విజేతలతో నిర్వాహకులు

భీమవరం అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ గోదావరి జిల్లా చెస్ అసోషియేషన్ ఆధ్వర్యంలో అండర్-13, ఓపెన్ అండ్ గర్ల్స్ చెస్ చాంపియన్‌షిప్ 2024 పోటీలు సోమవారం ముగిశాయి. రెండు రోజులుగా భీమవరం ఆర్యవైశ్య యువజన సంఘం భవనంలో పోటీలు జరిగాయి. బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో శంశాంక్ (తాడేపల్లిగూడెం), ద్వితీయ స్థానంలో కుశ్వంత్ (భీమవరం), బాలికల్లో విజేతులగా భీమవరం చెందిన సహస్ర మొదటి స్థానంలో నిలవగా, రెండోస్థానంలో అంజలి ప్రియ విజేతలుగా నిలిచారు. వీరికి జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించారు. నవంబరు 19 నుంచి 21 వరకు తాడేపల్లిగూడెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. అరసవల్లి ఈశ్వరమ్మ, వీర వెంకటాచారి చారిటబుల్ ట్రస్టు కార్యదర్శి మైలాపురి మురళి, సురేష్ జైన్, పెదపాటి రవి ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారిణులతో ప్రిన్సిపాల్, కోచ్‌లు

సౌత్‌జోన్ కబడ్డీ జట్టుకు సెయింట్ థెరిస్సా విద్యార్థినులు

ఏలూరు అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల యూనివర్శిటీ క్రీడాజట్ల ఎంపికల్లో భాగంగా సౌత్‌జోన్ మహిళా కబడ్డీ టోర్నమెంట్‌కు ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలకు చెందిన ముగ్గురు క్రీడాకారిణులు పి.కావ్య, పి.జోషిత, ఎం.నవ్య ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ ఓ ప్రకటనలో తెలిపారు. వీరు ఈనెల 26 నుంచి 30వ తేదీవరకు తమిళనాడులోని అలగప్ప విశ్వవిద్యాలయంలో జరుగనున్న దక్షిణమండలం కబడ్డీ టోర్నమెంట్‌లో నన్నయ యూనివర్శిటీ నుంచి ప్రాతినిత్యం వహిస్తారని వివరించారు. ఈనెల 2, 3 తేదీల్లో కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన యూనివర్శిటీ కబడ్డీ టీం సెలక్షన్లలో ఇదే కళాశాల నుంచి జి.ఇందు, కె.పవిత్ర, జె.ప్రత్యూష, కె.అన్సీ, ఎం.దివ్య, ఎస్.ప్రియా భవాని, బి.నీలిమ, సీహెచ్.వెంకటేశ్వరమ్మ, పి.ప్రియాంక ద్వితీయస్థానంలో నిలిచారని తెలిపారు. నన్నయ యూనివర్శిటీ పరిధిలోని ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి డిగ్రీ కళాశాలలకు చెందిన మొత్తం 14 జట్ల నుంచి సుమారు 200 మంది క్రీడాకారిణులు సెలక్షన్లకు హాజరుకాగా సెయింట్ థెరిస్సా కళాశాల టీంకు రెండోస్థానం లభించిందని వివరించారు. కోచ్‌లు తిరుమలరావు, కె.నాగేశ్వరరావు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మేజర్ సెలీన్‌రోజ్, కె.శ్యామలను ప్రిన్సిపాల్ అభినందించారు.

రేపు, ఎల్లుండి కైకరం హైస్కూల్‌లో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు



సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న తాడేపల్లిగూడెవ డీవై ఈవో భారతి

ఉంగుటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) :ఉంగుటూరు మండలం కైకరం హైస్కూలులో ఈనెల 6,7 తేదీలలో రాష్ట్రస్థాయి అండర్-14, 17 అథ్లెటిక్స్ ఎంపికలు జరుగుతాయని తాడేపల్లిగూడెం డీవైఈవో నిమ్మగడ్డ రవీంద్ర భారతి తెలిపారు. 13 జిల్లాల నుంచి 650 క్రీడాకారులు, 100 మంది కోచ్‌లు పాల్గొంటారన్నారు. పోటీల నిర్వహణకు వివిధ కమిటీలను ఏర్పాటు చేసినట్లు ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగసుధ వివరించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి అలివేలు మంగతాయారు, హెచ్‌ఎం గుళ్ల ప్రసాదరావు, ఒలింపిక్ సంఘం నాయకులు ఆదిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో హెచ్‌ఎం గుళ్ళ ప్రసాదరావు, ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు కైకరం విద్యార్థులు

ఉంగుటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయి అండర్-14 ఖోఖో పోటీల్లో ప్రతిభ చూపి కైకరం విద్యార్థులు భరత్, దేవకీ ప్రియాంక, ఎన్.లాస్యలు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. పల్నాడు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారు. బ్రాహ్మణగూడెంలో బాల్ బ్యాడ్మింటన్ పోటీ లలో అండర్-17 విభాగంలో గాలింకి లావణ్య, వందాని నాగ సాయి పవన్ కుమార్‌లు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని హెచ్‌ఎం ప్రసాదరావు తెలిపారు.

జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు



నూజివీడుటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత విశ్వవిద్యాలయాల ఫెన్సింగ్ పోటీలకు నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఎంపికైనట్లు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్ తెలిపారు. ఈ నెల 6 నుంచి 10 వరకు యూనివర్సిటీ ఆఫ్ జమ్మూలో నిర్వహించే ఫెన్సింగ్ పోటీలకు నూజివీడు ట్రిపుల్ ఐటీకి చెందిన 16 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. టీమ్ కోచ్‌గా డాక్టర్ సూర్య వ్యవహరిస్తున్నట్లు ఆయన తెలిపారు.

పిట్ట కొంచెం.. లాభాలు ఘనం



కౌజుపిట్టల పెంపకంపై రైతుల ఆసక్తి



రామారవుగూడెంలో కౌజు పిట్టల పెంపకం

కాలంతో పాటు వేగంగా పరిగెడుతూ ఉపాధికి అనేక మార్గాలను ఎంచు కుంటున్నారు. స్వయం శక్తితో ఎదగాలనుకునే వారికి చక్కటి మార్గాలు ఉన్నాయి. వ్యవసాయ రంగానికి అనుబంధ రంగాలు ఉన్నాయి. ఇక్కడ అనుభవమే ప్రధాన పెట్టుబడి. శ్రమ, ఓర్పు, నేర్పు అనేవి అభివృద్ధి సూత్రాలు.. నాన్‌వెజ్‌కు ఆదరణ పెరుగుతున్న క్రమంలో చికెన్ మటన్, నాటు కోడి కంటే సరసమైన ధరలో పుష్కలమైన పోషక విలువలు ఉండే కౌజు పిట్టల పెంపకంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. కౌజు పిట్టలను పెంచుతూ లాభాలను ఆర్జిస్తున్నారు.



దెందులూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : దెందులూరు నియోజకవర్గంలో సుమారుగా వంద మంది పైనే కౌజు పిట్టల పారం పెట్టుకుని జీవనం సాగిస్తూ మరికొంత మందికి ఉపాధి కల్పిస్తు న్నారు. కౌజు పిట్టల పెంపకాలు సులభం కావడంతో పాటు లాభసాటిగా ఉండటంతో కొత్త రకం ఉపాధిగా మారింది. పేదవేగి మండలం లోని కన్నాపురం, వేగివాడ, కొప్పుల వారి గూడెం, రామారావు గూడెం, చక్రాయి గూడెంతో పాటు పలు గ్రామాల్లో రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలలో కౌజు పిట్టల ఫారాలను ఏర్పాటు చేశారు.

ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటాం



కౌజు పిట్టల పెంపకంలో పిల్లల దశలో వేడి ఎక్కువగా ఉండేలా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటే పిల్లలు బాగా పెరుగుతాయి. వీటి మేత విషయంలో తల్లి, పిల్లలకు ఒకరకం మేత, మాంసం కోసం పెంచే పిట్టలకు వేర్వేరు మేతలను అందిస్తుంటాం. రోజుకు 3 వేల నుంచి 4 వేల పిట్టలను విక్రయిస్తాం.

- సుంకర సోమేశ్వరావు కౌజు పిట్టల పెంపకందారుడు

సెంటు స్థలంలో కూడా పెంచవచ్చు..

గుడ్లను ఇంక్యూబేటర్ ద్వారా పిల్లలను ఉత్పత్తి చేసి రైతులకు అందిస్తూ కొంతమంది ఆదాయం పొందుతుండుగా కొంత మంది చిన్న పిల్లలను పెంచి అమ్ముకుంటూ ఉపాధి పొందు తున్నారు. పోషక విలువలు ఎక్కువగా ఉండ టంతో కౌజుపిట్ట గుడ్డు నాలుగు రూపాయలకు అమ్ముతున్నారు. మాంసం కోసం ప్రత్యేకంగా పిల్లలను 50 రూపాయలకు అమ్ముతున్నారు. 10 సెంట్లు స్థలంలో కుడా కౌజు పిట్టలను పెద్ద స్థాయిలో పెంచే అవకాశం ఉంది. గుడ్డు దశ నుంచి 18 రోజుల నుంచి 20 రోజుల్లో పిల్లలుగా అందుబాటులోకి వస్తాయి. 40 నుంచి 50 రోజుల్లో విక్రయించే దశకు చేరుతాయి. కౌజు పిట్టలకు మొక్కజొన్న, సోయా పిండి వంటి వాటిని మేతగా అందిస్తారు. ఇవి వేడి వాతావరణంలో పెరుగుతాయి. దీంతో మండలంలోని మెట్ట గ్రామాల్లో రైతులు రేకుల షెడ్లలో వీటిని పెంచుతున్నారు. నీటి అవసరం కూడా పెద్దగా ఉండదు. నియోజకవర్గంలో సుమారుగా 100 పైగా కౌజు పిట్టల పెంపకం కేంద్రాలు ఉన్నాయి

జాగ్రత్తగా పెంచితే నష్టం రాదు



ఒక్కో కౌజుపిట్ట పిల్ల 8 రూపాయలకు కొనుగోలు చేస్తారు. వాటిని 40 రోజుల పాటు వివిధ రకాల దాణా పెట్టి పెంచుతారు. ఒక్కో పిట్టకు సుమారు అరకేజీ దాణా (రూ.22) అవుతుంది.. కరెంట్ తదితర ఖర్చులు కలుపుకుంటే ఒక కౌజు పిట్ట పెంపకానికి రూ.30 నుంచి రూ.40 రూపాయలు ఖర్చు అవుతుంది. కౌజుపిట్ట తయారైతే 120 గ్రాముల నుంచి 130 గ్రాముల వరకూ బరువు వస్తుంది. ఒక్కోటి రూ.45 50 రూపాయలకు అమ్ముతారు. కష్టపడి పెంచుకుంటే రైతులకు నష్టం వచ్చే అవకాశం తక్కువ

- అనిల్, పెంపకందారుడు

ఆవిరైన.. ఆనందం!



మృతులు బొల్లా వీర్రాజు, నాగేంద్ర, మణికంఠ, కాసగాని కృష్ణ



కోపోద్రిక్తులైన గ్రామస్తులను సముదాయిస్తున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు

సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ ఫ్లెక్సీ కడుతుండగా విద్యుదాఘాతం

నలుగురు యువకుల మృతి .. ముగ్గురికి గాయాలు.. కన్నీరు మున్నీరైన బంధువులు

తాడిపర్రులో తీవ్ర విషాదం.. 144 సెక్షన్ ఏర్పాటు.. ఫ్లెక్సీల తొలగింపునకు ఆదేశాలు

మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి పరామర్శ.. ఒక్కొక్కరికీ రూ.5 లక్షల సాయం

ఉండ్రాజవరం/పెరవలి/తణుకు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం మండలం తాడిపర్రు గ్రామంలో ఆనందం ఆవిరైంది.. ఎంతో ఉత్సాహంగా ఉండాల్సిన రోజున తీవ్ర విషాదంతో నిండిపోయింది. రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాలు వారివి.. అయితేనేం గ్రామంలో ఏ కార్యక్రమం జరిగినా ముందుండే వారు. ఉత్సాహంగా పాల్గొనేవారు. సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటులోను అదే ఉత్సాహం చూపారు. 18 నెలలుగా విగ్రహ ఏర్పాటుపై వివాదం నెలకొనడంతో ఎప్పుడెప్పుడు విగ్రహావిష్కరణ జరుగుతుందా అని ఎదురు చూశారు. స్థల వివాదం తదితర కారణాలతో గ్రామంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇరు వర్గాలతో జిల్లా అధికారులు, నాయకులు శాంతి చర్చలు జరిపి, ఒక కమిటీ వేసి విగ్రహాన్ని కొన్ని నిబంధనలతో ఏర్పాటు చేసుకునేందుకు అనుమతిచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం సర్దార్‌పాపన్నగౌడ్ విగ్రహానికి ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. అనుకున్నదే తడవుగా 20 అడుగుల భారీ ఫ్లెక్సీ చేయించారు. ఆదివారం తీసుకొచ్చి ఐరన్ చట్రానికి ఫ్లెక్సీని అమర్చారు.. సోమవారం తెల్లవారుజామున ఫ్లెక్సీ ఏర్పాటుకు ఉపక్రమించారు. ఐరన్ ఫ్రేమ్‌కు సర్దార్ పాపన్నగౌడ్ ఫ్లెక్సీని అంటించి కర్రలతో నిలబెట్టే సమయంలో రోడ్డు పక్క నుంచి వెళ్లిన 6.3 కేవీ సింగిల్ ఫేజ్ కరెంటు వైర్‌కు తగిలింది. ఫ్లెక్సీ పట్టుకున్న ఏడుగురిలో బొల్లా వీర్రాజు (26), పామర్తి నాగేంద్ర(25), మారిశెట్టి మణికంఠ(26), కాసగాని కృష్ణ (25) అక్కడికక్కడే మరణించారు. కోమటి అనంతరావు తీవ్రంగాను, వెలిగట్ల పవన్, కోమటి వీరవెంకట సత్యనారాయణల స్వల్పంగాను గాయపడ్డారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది. ఘటనా స్థలానికి పెద్ద సంఖ్యలో బాధితులు తరలి వచ్చారు. ఆర్తనాదాలతో పెద్ద పెట్టున రోదించారు.



సంఘటనా ప్రాంతంలో పర్యటిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ఆదుకుంటాం: మంత్రి దుర్గేష్

ఆసుపత్రిలో మృతకుటుంబాలను పరామర్శించిన మంత్రి దుర్గేష్ పరామర్శించారు. బాధిత కుటుంబీకులకు అండగా ఉంటామని తెలిపారు. మృతదేహాలను పరిశీలించి వారి కుటుంబసభ్యులను ఓదార్చారు. ప్రభుత్వం నుంచి మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియో అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కోమటి అనంతరావు, వెలిగట్ల పవన్, కోమటి వీరవెంకటసత్యనారాయణలను మంత్రి దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులకు సూచించారు. ఘటనా ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ ప్రశాంతి సోమవారం పరిశీలించారు. సంఘటన పట్ల ఆమె విచారం వ్యక్తం చేసి బాధిత కుటుంబీకులను ఓదార్చారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఒక్కొరికి రూ.5లక్షలు చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పారు. గ్రామంలో మరో సామాజిక వర్గం వారు తమపై తరచూ ఘర్షణలు సృష్టిస్తున్నారని గౌడ సామాజిక వర్గ మహిళలు కలెక్టర్‌కు మొర పెట్టుకున్నారు. తమకు న్యాయం చేసి వెళ్లాలని కలెక్టర్ కారు ముందు మహిళలు నిల్చుని నినాదాలు చేశారు. వారికి ఆర్డీవో రాణిసుస్మిత, డీఎస్పీ దేవకుమార్ నచ్చజెప్పడంతో వెనుదిరిగారు.

మృతదేహాలు రాకతో ఉద్రిక్తత..

తాడిపర్రు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎంతో ఆనందంగా ఉండాల్సిన రోజునే తీవ్ర విషాదంతో నిండిపోయింది. తణుకు ఆసుపత్రిలో పోస్టుమార్టం పూర్తయిన అనంతరం మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో మృతదేహాలు స్వగ్రామం తాడిపర్రుకు చేరుకున్నాయి. ఈ విషయం తెలియడంతో అప్పటికే సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహం వద్దకు అధిక సంఖ్యలో గ్రామస్థులు చేరుకున్నారు. ఆ మృతదేహాలను విగ్రహం వద్దనే ఉంచాలని.. వివాదానికి ఆజ్యం పోసేలా ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన వేరే సామాజికవర్గం యువకులను ఇక్కడకు తీసుకురావాలని వారంతా పట్టుబట్టారు. అప్పటికే అక్కడకు చేరుకున్న నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అక్కడ ఉన్న మహిళలు, గౌడ సామాజివర్గం నాయకులతో మాట్లాడారు. వివాదాలకు ఇది సమయం కాదని సర్దిచెప్పారు. దీంతో మృతదేహాలను వాహనాల నుంచి కిందకు దించి పాపన్నగౌడ్ విగ్రహం ముందు పెట్టి పూలు చల్లి ఆయా కుటుంబీకుల ఇళ్ల వద్దకు చేర్చారు. అనంతరం ఆయా ఇళ్ల వద్ద నుంచి ఎవరివారు మృతదేహాలను తీసుకుని తీపర్రు వద్ద గోదావరి తీరంలో దహనసంస్కారాలు చేశారు. గ్రామంలో ఏ కార్యక్రమం జరిగినా ముందుండే యువకుల మృతిని గ్రామస్థులు తట్టుకోలేకపోతున్నారు.

నాయకుల పరామర్శ

మృతుల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు పరామర్శించారు. సంఘటన స్థలాన్ని సందర్శించి మృతులకు సంతాపం తెలిపారు. సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు మాట్లాడుతూ నలుగురు యువకుల మృతి బాధాకరం అన్నారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. తమ సామాజిక వర్గానికి చెందిన నలుగురు యువకులు మృతిచెందడం బాధాకరమని గౌడసంఘ మాజీ అధ్యక్షుడు మోతుకూరి సత్యనారాయణ పేర్కొన్నారు. గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొల్పాలని కోరారు. గ్రామంలో పోటాపోటీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రమాదం చోటుచేసుకుందన్నారు.

ఒక వర్గానికి చెందిన ఫ్లెక్సీలు చించివేత

గ్రామంలోకి మృతదేహాలు వచ్చి వెళ్లిన అనంతరం కోపోద్రిక్తులైన ఒక వర్గం యువకులు గ్రామంలో వేరొకవర్గం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేశారు. పోలీసులు వద్దని వారిస్తున్నా వినకుండా రోడ్డు పొడవునా ఇరువైపులా పది నుంచి పదిహేను ఫ్లెక్సీలను చించివేసి రోడ్డుపై పడవేశారు. అంతేకాకుండా కొంత మంది మరో వర్గం ఇళ్లపైకి వెళ్లిపోతుండగా వద్దని పోలీసులు వారించి వెనక్కు తీసుకువచ్చారు. సర్దార్‌పాపన్నగౌడ్ విగ్రహాన్ని సోమవారం ప్రారంభించడానికి ముందురోజు అదే రోడ్డులో ఒక ఇంటి ముందు మరో సామాజిక వర్గానికి చెందిన నాయకుడి విగ్రహం ఏర్పాటు చేశారు. దానికి పోటీగా అదే సైజులో ఏడుగురు యువకులు సర్దార్‌పాపన్నగౌడ్ ఫ్లెక్సీని సోమవారం తెల్లవారు జామున ఏర్పాటు చేస్తుండగా ప్రమాదం జరిగిందని మండిపడ్డారు.ఈ సంఘటన అనంతరం తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ గ్రామంలో ఎటువంటి ఫ్లెక్సీ ఉండరాదని, ఎవరు ఏర్పాటు చేస్తే వారే దానిని తీసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. అలా తొలగించని ఫ్లెక్సీలను పంచాయతీ తరపున తొలగిస్తామని, గ్రామం అంతా ఆటోలో తిప్పి ప్రచారం చేయించారు. దీంతో కొన్ని ఫ్లెక్సీలను ఎవరికి వారు తొలగించగా.. మరికొన్ని ఫ్లెక్సీలను పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది తొలగించి పంచాయతీ కార్యాలయానికి తరలించారు. ఇరు సామాజిక వర్గాల మధ్య వివాదం నెలకొనే సూచనలు కనిపించడంతో తాడిపర్రు గ్రామంలో 144 సెక్షన్ విధించారు. కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు, ఇతర పోలీస్ స్టేషన్ల నుంచి వచ్చిన వారితో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.





సంఘటనా ప్రాంతంలో ఎస్ఈ తిలక్

విచారకరం

ట్రాన్స్‌కో ఎస్ఈ బాల గంగాధర్ తిలక్

తాడిపర్రులో విద్యుత్ ప్రమాదంలో నలుగురు మృతిచెందడం విచారకరమని ఎస్ఈ బాలగంగాధర్ తిలక్ పేర్కొన్నారు. ఫ్లెక్సీలు కట్టిన ప్రాంతంలో 6.3 కేవీ విద్యుత్ లైన్ ఉందని, 3 అడుగుల దూరంలో ఏది ఉన్నా కరెంట్ షాక్ కొడుతుందని చెప్పారు. ఫ్లెక్సీలు నేల నుంచి 6 నుంచి 10 అడుగులు లోపే పెట్టుకోవాలని, ఎత్తు పెరిగితే ప్రమాదాలు జరుగుతాయన్నారు. మృతుల కుటుంబాల కోసం తమ శాఖ తరపున ప్రభుత్వానికి నివేదిక పంపుతామని ఎస్ఈ తిలక్ చెప్పారు.

కన్నీరు మున్నీరు.. మిన్నంటిన రోదనలు



విలపిస్తున్న బొల్లా వీర్రాజు కుటుంబ సభ్యులు

రోజువారీ కూలీలతో కుటుంబాలు నెట్టికొస్తున్న పేదల జీవితాల్లో చీకట్లు చిమ్ముకున్నాయి. మృతి చెందిన నాలుగు కుటుంబాల రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి. తాడిపర్రుకు చెందిన మృతుడు బొల్లా వీర్రాజుకు 14 నెలల కిందట పెళ్లయింది. 2 నెలల పాప ఉంది. తలిదండ్రులు, భార్య ఉన్నారు. వ్యవసాయం, కొబ్బరి దింపు పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మళ్లీ వస్తానంటూ వెళ్లావా త్వరగారా అంటూ తండ్రి త్రిమూర్తులు రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. పామర్తి నాగేంద్రకు పట్టింపాలెం గ్రామానికి చెందిన దుర్గతో వివాహమైంది. వీరికి 8 నెలల పాప ఉంది. కొబ్బరి దింపు కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. భర్త మృతి వార్తను జీర్ణించుకోలేకపో తోంది. తనకు దిక్కు ఎవరూ అంటూ రోదిస్తోంది. తలిదండ్రులు పామర్తి శ్రీను, ఆదిలక్ష్మి, అన్నయ్య వెంకటకృష్ణ ఉన్నారు. మణికంఠ పూలడెకరేషన్‌లకు వెళుతుంటాడు. ఖాళీ సమయాల్లో వ్యవసాయ పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మృతుడికి భార్య భవాని, అమ్మాయి(5), అబ్బాయి (3) ఉన్నారు. మణికంఠకు నలుగురు తోబుట్టువులు ఉన్నారు. ఇంట్లో ఒక్కడే అబ్బాయి కావడంతో అల్లారు ముద్దుగా పెంచారు.తమ ఒక్కగానొక్క కుమారుడు ఇక లేడని తెలియడంతో తల్లిదండ్రులు పద్దయ్య, లక్ష్మి, సోదరీమణులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కాసకాని కృష్ణ పెయింటింగ్ షాపులో చిరుద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.ఇంకా పెళ్లి కాలేదు. తండ్రి రాము ఉపాధి నిమిత్త దుబాయ్‌లో ఉన్నాడు. ఇటీవలే అనారోగ్యం కావడంతో వచ్చి ఆపరేషన్ చేయించుకుని నెల రోజుల కిందట దుబాయి వెళ్లాడు. అక్కడ ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో వారం పది రోజుల్లో ఇం డియా వచ్చేస్తాడని బంధువులు చెప్పారు. ఒక్కగానొక్క కొడకు ప్రమాదంతో మృతి చెందడంతో ఇక మేమెందుకు బతకాలంటూ తల్లి పద్మ కన్నీరు మున్నీరుగా విలపించింది. ఆమెను ఓదార్చడం ఎవరి వల్లా కాలేదు. తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కోమటి అనంతరావు కోడిగుడ్లు కట్టుబడి పనికి వెళుతుంటాడు. ఇతనికి ఇద్దరు మగపిల్లలు. తీవ్రగాయాలతో ఉన్న భర్తను చూసి భార్య, తలిదండ్రులు సత్యనారాయణ, వెంకటలక్ష్మి కన్నీటిపర్యంతమ వుతున్నారు.

నేటి నుంచి మాస్టర్ ట్రైనీలకు శిక్షణ

ఏలూరుసిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌ల అభివృద్ధి ప్రణాళికలకు సంబంధించి మాస్టర్ ట్రైనీలకు ఈనెల 5వ తేదీ నుంచి 8 వరకు రెండు విడతులుగా శిక్షణ కార్య క్రమాలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ సీఈవో కెఎస్ఎస్ సుబ్బారావు తెలిపారు. ఏలూరులోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో శిక్షణ ఉంటుంది. ప్రతి మండలం నుంచి ఎంపీ డీవో, ఈఓపీఆర్ అండ్ఆర్‌డి, ఇద్దరు అనుభవం కలిగిన పంచాయతీ కార్యదర్శులు, ఒక డిజిటల్ అసిస్టెంట్ లేదా కంప్యూటర్ ఆపరేటర్, లైన్ డిపార్ట్‌మెంట్స్‌కు చెందిన జిల్లా అధికారులు ఈ శిక్షణా తరగతులకు హాజరు కావాలన్నారు.



మాగంటి బాబుకు అస్వస్థత

ఏలూరు టూటౌన్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ మాగంటి బాబు అనారోగ్యంతో మణిపాల్ ఆసుపత్రిలో చేరారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి అపెండిసైటీస్ వ్యాధిగా నిర్ధారణ చేశారు. వెంటనే పెద్దప్రేగుకు ఆపరేషన్ నిర్వహించారు. ఆపరేషన్ విజయవంతమైందని వైద్యులు తెలిపినట్లు మాగంటి బాబు కార్యాలయం తెలిపింది. విజిటర్స్‌కి అనుమతి లేనందున ఆసుపత్రికి ఎవరూ రావద్దని తెలిపారు.

మృతదేహంతో రోడ్డుపై ఆందోళన

ఆర్ఎంపీ డాక్టర్‌ను అరెస్టు చేయాలని డిమాండ్



దెందులూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీ డాక్టర్ సక్రమంగా వైద్యం చేయకపోవడం వల్లనే కందిరీగల దాడికి గురైన వ్యక్తి మృతి చెందాడని చల్లచింతలపూడి గ్రామస్థులు రోడ్డుపై మృతదేహాన్ని ఉంచి ఆందోళనకు దిగారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చల్లచింతలపూడి గ్రామానికి చెందిన వేముల సత్యనారాయణ(52) కొబ్బరి బొండాలు కోసే పనికి వెళ్త జీవనం సాగిస్తుంటాడు. అదే గ్రామానికి చెందిన ఒకవ్యక్తి దగ్గర పనికి కొబ్బరి బొండాలు కోసేందుకు ఆదివారం సూరప్పగూడెం పరిసర ప్రాంతాల్లో వెళ్లి కొబ్బరి కాయలు కొస్తుండగా కొబ్బరి తోటలో కందిరీగలు దాడి చేసి తీవ్రంగా కుట్టాయి. దీంతో సత్యనారాయణను పంగిడిగూడెంలో ప్రాథమిక చికిత్స చేసి ఆర్ఎంపీ డాక్టర్ ఇంటి దగ్గరకు తీసుకుని వచ్చారు. దీంతో ఆయన రెండు ఇంజక్షన్‌లు చేసి తీసుకుని వెళ్ళమన్నారు. అయితే సత్యనారాయణ సాయంత్రం 6 గంటల సమయంలో మృతి చెందాడు. దీంతో వారు డాక్టర్ చేసిన ఇంక్షన్‌లకు మృతి చెందాడని ఆర్ఎంపీ డాక్టర్‌ను అరెస్టు చేయాలని గ్రామస్థులు మృత దేహంతో ఏలూరు- ద్వారకాతిరుమల ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. ట్రాఫిక్ నిలిపోవడంతో పోలీసులు వచ్చి గ్రామస్థులతో మాట్లాడారు. మృతుడు కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు తీసుకుని ఏఎస్‌ఐ వెంకటేశ్వరావు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మద్యం మత్తులో విధులకు ఉపాధ్యాయుడు

కుక్కునూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నెమలిపేట మండలపరిషత్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు మద్యం మత్తులో ఆ పాఠశాలకు వస్తున్నాడని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. పాఠశాలకు తాళం వేసి తమ నిరసన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడు గత కొంత కాలం నుంచి మద్యం తాగి వస్తూ ఆ మత్తులో పిల్లలను కర్కశంగా కొడుతునట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. దీంతో ఎంఈవో గిరిభగవాన్‌దాస్ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులంతా ఉపాధ్యాయుని పై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.

ఎర్రకాల్వలో మునిగి యువకుడి మృతి



రాజ్‌కుమార్(ఫైల్)

జంగారెడ్డిగూడెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొంగువారిగూడెం ఎర్రకాలువ జలాశయంలో స్నానానికి దిగి తంటిపూడి రాజ్ కుమార్ (22)మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. పెదవేగి మండలం రామసింగవరం గ్రామానికి చెందిన కొబ్బరి కాయలు దింపుడు కూలీలు ఆదివారం బుట్టాయగూడెం గుబ్బల మంగమ్మ తల్లి ఆలయానికి పదిహేను మంది వెళ్లారు. అక్కడ భోజనాలు చేసి తిరు గు ప్రయాణంలో ఎర్రకాలువ జలాశయం వద్ద స్నానానికి దిగారు. కొద్దిసేపటికి రాజ్‌కుమార్ గల్లంతయ్యాడు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. గజ ఈతగాళ్ళతో మృత దేహాన్ని వెలుపలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

తాకట్టు వ్యాపారికి మస్కాకొట్టి బంగారం చోరీ

నరసాపురం, నవంబరు 4: పట్టణంలోని బులియన్ మార్కెట్‌లో సోమవారం రాత్రి తాకట్టు వ్యాపారికి మస్కాకొట్టి రూ.3 లక్షలు విలువైన బంగారు గాజులతో పరారయ్యాడు. టౌన్ ఎస్సై జయలక్ష్మి తెలిపిన వివరాలు ప్రకారం బులియన్ మార్కెట్‌లోని అడ్డగళ్ళ బాంకర్స్ షాపు వద్దకు ఓ వ్యక్తి వచ్చి షాపు యజమానికి బంధువు, గతంలో బంగారు వస్తువులు తాకట్టు పెట్టిన అడ్డగళ్ళ కామేష్ పేరు చెప్పాడు. వస్తువులు విడిపించమని రూ.లక్ష ఇచ్చి పంపాడని నిమ్మించాడు. ఆ పేరు విన్న షాపు యాజమాని పద్దు పుస్తకం తీసి చూశాడు. కామేష్ పేరున తాకట్టు పద్దు ఉండటంతో లాకరు నుంచి వస్తువులు తీసి ఇచ్చాడు. 28 గ్రాములు విలువైన రెండు గాజులను పద్దు కాగితంపై పెట్టి లాకర్ తలుపు వేసేందుకు లోపలికి వెళ్లగానే వస్తువుల్ని తీసుకొని దుండగుడు పరారయ్యాడు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. పక్కా ప్లాన్‌గా చోరీ చేసినట్లు భావించిన పోలీసులు పరిసర ప్రాంతాలలోని సీసీ కెమేరాలను పరిశీలి స్తున్నారు.

మద్యం షాపులు కళకళ.. బార్లు విలవిల!

షాపులలోనే బ్రాండెడ్ మద్యం లభ్యం

బార్లకు తగ్గిన వ్యాపారం

మొన్నటి వరకు బార్లలో ధరల దరువు

ఇప్పుడు పోటీగా బ్రాందీ షాపులు



పాలకొల్లు/పాలకొల్లు రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నూతన మద్యం పాలసీ అములులోకి వచ్చిన దరిమిలా బార్లకు కష్టాలు మొదలయ్యాయి. జగన్ రెడ్డి పాలనలో ప్రభుత్వ దుకాణాలలో నాసిరకం మద్యమే లభించేది. దీంతో ధరలు ఎక్కువైనా బ్రాండెడ్ మద్యం తాగాలనుకున్న మద్యపాన ప్రియులు బార్లను ఆశ్రయించేవారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన అనంతరం ఇప్పుడు ప్రైవేటు మద్యం షాపులలో అన్ని రకాల మద్యం బ్రాండులను అందుబాటులోకి తెచ్చారు. దీంతో మద్యం కొనుగోలుదారులు బార్లు వైపు చూడటం మానేశారు.

- నూతన మద్యం పాలసీ అమలుకు ముందు బార్లలో క్వార్టర్ మద్యం బాటిల్‌పై గరిష్టంగా రూ.100, ఫుల్‌బాటిల్‌పై గరిష్టంగా రూ.500 అదనంగా అమ్మేవారు. ఇప్పుడు ప్రైవేటు మద్యం షాపులలో ఎమ్మార్పీకే మద్యం లభిస్తున్నది. వాస్తవంగా ప్రైవేటు షాపులకు ఎమ్మార్పీ కంటే 10.5శాతం తక్కువ ధరకు మద్యం వస్తుంది. ఎమ్మార్పీ ధరలు ఉల్లంఘించి అమ్మితే జరిమానా, షాపు లైసెన్స్ రద్దుచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. దీంతో ప్రైవేటు మద్యం షాపులలో ఎమ్మార్పీకే మద్యం అమ్ముతున్నారు.
- బార్లు విషయానికొస్తే ఎమ్మార్పీకి ప్రభుత్వం నుంచి మద్యం కొనుగోలు చేయాల్సి ఉంది. ఎమ్మార్పీ ధరకు కొనుగోలు చేసి తమకు నచ్చిన రీతిలో అయా బార్లు సామర్థ్యాన్ని బట్టి ఎక్కువ ధరకు అమ్ముకోవచ్చు. మొన్నటి వరకు ఇలా అధిక ధరలకు అమ్మి బార్లు బాగా దండుకున్నాయి. అయితే ఊహించని రీతిలో ఇప్పుడు ప్రైవేటు మద్యం షాపులలో అన్ని రకాల బ్రాండుల మద్యం చల్లటి బీరు ఎంఆర్పీకే లభిస్తుండటంతో బార్ల ఆదాయానికి గండి పడింది. ఉమ్మడి జిల్లాలోని ఏలూరు నగరంతో సహా అన్ని పట్టణాలలో గల బార్లలో మద్యం నూతన పాలసీకి ముందు ఒక్కొక్క బీరు ఎమ్మార్పీ కంటే రూ. 80నుంచి 100 అధికంగా అమ్మేవారు. ఇప్పుడు జిల్లాలో అధిక శాతం బార్లలో బీరులు ఎమ్మార్పీ కంటే రూ.20లు మాత్రమే అధికంగా అమ్ముతున్నారు. అయితే పాలకొల్లు, మరికొన్ని పట్టణాలలో అందినకాడికు దండుకునే ఉద్దేశంతో ఇంకా బీరులపై రూ.40 నుంచి80 అధిక ధరలకు అమ్ముతున్నారు.

బార్లకు బీర్లు?

ఈ ధరలను గమనిస్తే మద్యం షాపులు నుంచి కొన్ని రకాల బ్రాండ్ బీరులు బార్లకు అడ్డదారిలో వెళుతున్నాయని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రెండు మూడు రోజులుగా పలు బ్రాందీషాపులలో బీరులు లేవని చెబుతున్నారు. దీంతో మద్యపాన ప్రియులు అనుమానాలు వ్యక్తం చేస్తూ మరలా దొడ్డిదారిన బారులకు వెళ్తున్నాయని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఏడాది జూలై నెలఖారు వరకు బారులకు లైసెన్స్‌లు ఉన్నాయి. అప్పటి వరకు అమ్మకాలు ఎలా పెంచుకోవాలని బారుల యజమానులు మల్లగుల్లాలు పడుతున్నారు. బారులకు నూతన మద్యం పాలసీలో ఎమ్మార్పీ కంటే తక్కువ ధరలకు ఇవ్వాలని పలు బారుల యజమానులు వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తంగా అన్ని రకాల మద్యం బ్రాండులు షాపులలో లభ్యం కావడంతో బారులు బేరమంటున్నాయి.

మద్యం షాపులు వద్దంటూ ఆందోళనలు



పైడావలో ధర్నా చేస్తున్న మహిళలు

నరసాపురం టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నివాసాల మధ్య మద్యం షాపు పెట్టవద్దంటూ సోమవారం ప్రగతినగర్‌కాలనీ మహిళలు ఆందోళన చేశారు. పీతానిమెరక రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. సుమారు రెండు గంటలు ఆందోళన చేసినా అధికారులెవ్వరూ స్పందించలేదు. దీంతో సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి ఆర్డీవో దాసిరాజుకు వినతిపత్రం అందించారు. కాలనీ మహిళలు మాట్లాడుతూ సమీపంలో బాలికల గురుకుల పాఠశాల ఉందన్నారు. నిత్యం వేలాది మంది వెళ్లే రహదారిపై మద్యం షాపు ఏర్పాటు చేస్తే సమీపంలోని కాలనీ ప్రజలకు, విద్యార్థులకు మందుబాబుల వల్ల ఇబ్బందులు పడే ప్రమాదం ఉందన్నారు.

పోడూరు: పెనుమదం, నుంచి మండల కేంద్రానికి వెళ్లే పైడావ రోడ్డులో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయవద్దంటూ పైడావ ఏరియాలోని ఏడు కాలనీలకు చెందిన స్థానికులు, మహిళలు, విద్యార్థినులు ధర్నా నిర్వహించారు. గతంలో పెనుమదం శివారు చిట్టితగుంట రోడ్డులో ప్రభుత్వ మద్యం దుకాణం వద్దే మళ్లీ మద్యం దుకాణం పెడుతుండగా ఆ ఏరియాలో స్థానికులు నాలుగు రోజుల క్రితం ధర్నా చేశారు. దీంతో ఈ మద్యం దుకాణాన్ని పైడావ రోడ్డులో ఏర్పాటు చేసేందుకు సోమవారం సన్నాహాలు ప్రారంభించగా సమాచారం తెలుసుకున్న ఈప్రాంతంలోని మహిళలు వచ్చి ఇక్కడ మద్యం దుకాణం పెట్టవద్దంటూ ఆందోళన చేపట్టారు.

కొడుకులు ఇంటి నుంచి గెంటేస్తున్నారు

ఆర్డీవోకు ఓ తండ్రి వినతి



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న విశ్వనాథన్

నరసాపురం, నవంబరు4(ఆంధ్రజ్యోతి): మూడేళ్ళ క్రితం నా భార్య చనిపోయింది. నా ఇద్దరి కొడుకులు చూడటం లేదు. ఆస్తి కోసం ఒక కొడుకు కొట్టి ఇంటి నుంచి బయటకు గెంటేశాడు. వారి నుంచి రక్షణ కల్పించాలని సోమవారం ప్రజా సమస్యల పరిష్కర వేదికలో పాలకొల్లు మండలం వెలివెలి గ్రామానికి చెందిన గుమ్మాపు విశ్వనాథన్ ఫిర్యాదు చేశాడు. దీనికి సంబంధించి తండ్రి తెలిపిన వివరాలు ప్రకారం.. అనారోగ్యంతో నా భార్య మూడేళ్ళ క్రితం చనిపోయింది నాకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గ్రామంలో రెండు ఎకరాల పొలంతో పాటు రెండు పోర్షన్ల ఇల్లు ఉన్నది. ఇద్దరు కొడుకులు చెరో పోర్షన్‌లో ఉంటున్నారు. తాను పెద్ద కుమారుడు వద్ద ఉంటున్నాను. ఇటీవల ఇద్దరు కొడుకులు ఆస్తి కోసం తనతో గొడవ పడుతున్నారు. పంచాయితీలో కూడా పెట్టారు. నా తదనంతరం ఇల్లు, రెండు ఎకరాల పొలం ఇద్దరు కొడుకులకు ఇస్తానని పెద్ద సమక్షంలో చెప్పాను. కానీ వినడం లేదు. నన్ను కొట్టి బయటకు గెంటేస్తున్నారంటూ రోధించాడు. స్పందించిన ఆర్డీవో పాలకొల్లు రూరల్ పోలీసులకు ఫోన్ చేసి కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ఇద్దరు కొడుకుల చేత ఇల్లు ఖాళీ చేయించి, తండ్రికి ఇల్లు అప్పగించాలన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం



రక్త దాన శిబిరాన్ని పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి వర్మ

పాలకొల్లు అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నాయకుడు, కాకినాడ పార్లమెంట్ ఇన్‌చార్జి రావూరి లక్ష్మణ స్వామి (సుధ) ప్రజలకు ఉపయోగ పడే విధంగా పుట్టిన రోజు జరుపుకోవడం అభినందనీయమని కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు, స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాల్లో సోమవారం సుధ పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరం, రక్త దాన కార్యక్రమాలలో కేంద్ర మంత్రి వర్మ పాల్గొని సుధకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. 250 మందికి వైద్య నిపుణులు పరీక్షలు చేశారు. బీజేపీ సీనియర్ నాయకుడు పి.సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు ఎస్.తాతాజీ, నరసాపురం జిల్లా ప్రధానకార్యదర్శి పి.వెంకటేశ్వ రరావు, ఎ.పద్మ వర్మ, వై.పద్మారావు, మాజీ ఎమ్మెల్సీ ఎ.రామమోహన్, వై.తాతాజీ పాల్గొన్నారు.

వినతులు స్వీకరించిన నాయకర్



సీఎం రిలీఫ్ పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే నాయకర్

నరసాపురం టౌన్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో సోమవారం నిర్వహించిన జనవాణిలో ఎమ్మెల్యే నాయకర్ విచ్చేసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పిఠాపురంనకు చెందిన బి.చిన్న అనే వ్యక్తి గుండె, కిడ్నీ సమస్యతో బాధపడుతూ నాయకర్‌కు వినతిపత్రం అందించారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అందుబాటులో లేకపోవడంతో నాయకర్ సీఎం రిలీఫ్ ఫండ్ సంబంధించిన పత్రాలను బాధితుడికి అందించారు. జనవాణిలో వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించి న్యాయం చేస్తామన్నారు.

'కాలేజీ అభివృద్ధికి కృషి చేస్తా'

ఆకివీడు రూరల్ నవంబరు 4 : దుంపగడప లోని వీవీ గిరి కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అన్నారు. కాలేజీలో జరిగిన సీపీడీసీ సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కంప్యూటర్ కోర్సులు, ఎన్‌సీసీ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. సీపీడీసీ కార్యదర్శి డాక్టర్ ప్రతాప్‌కుమార్, టి.బాబు, ప్రిన్సిపాల్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధాంతం సెక్షన్ ఏఈకి సంజాయిషీ నోటీస్

పాలకొల్లు టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : నరసాపురం ఇరిగేషన్ సబ్ డివిజన్ సిద్ధాంతం సెక్షన్‌లో పనిచేస్తున్న ఏఈ కె.శ్రీనివాస్‌కు సంబంధిత ఉన్నతాధికారి సోమవారం సంజాయిషీ నోటీసు ఇచ్చారు. రెండు రోజులు క్రితం పోడూరు మండలం వద్దిపర్రు వెళ్లిన మంత్రి నిమ్మల రామానాయుడుకు వరిచేలకు సాగు నీరు అందక ఇబ్బందులు పడుతున్నామని గ్రామ రైతులు మొరపెట్టుకున్నారు. రైతులకు సాగునీరు అందించడం, నీటి విడుదల సక్రమ నిర్వహణ లేకపోవడం, తూడు తొలగింపు విషయంలో నిర్లక్ష్యంతో ఉన్న ఏఈ పై ఎందుకు చర్యలు తీసుకోకూడదో కోరుతూ సంజాయిషీ ఇవ్వాలని నోటీసు జారీ చేశారు. సాగునీరు అందించడంతో ఏ అధికారి నిర్లక్ష్యం వహించినా చర్యలు తీసుకుంటామని మంత్రి రామానాయుడు హెచ్చరించారు.

శకుంతలా దేవి జయంతి

భీమవరం ఎడ్యుకేషన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నప్పటి నుంచి గణితంపై అభిరుచిని పెంచుకోవాలిని హెచ్ఎం బి.వెంకటేశ్వర్లు అన్నారు. అనాకోడేరు డీఎన్నార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం హ్యూమన్ కంప్యూటర్ శకుంతలా దేవి జయంతి నిర్వహించారు. విద్యార్థులకు హ్యూమన్ కంప్యూటర్ శకుంతలా దేవి అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు గణిత ఉపాధ్యాయుడు ఆర్.వెంకన్నబాబు సౌజన్యంతో గణితానికి సంబంధించిన పుస్తకాలను బహూకరించారు.

డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలి

మొగల్తూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తమ కాలనీలో మురుగునీరు పారే సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని అధికారులు స్పందించి డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలంటూ సోమవారం ఆదర్శనగర్ కాలనీ వాసులు ఆందోళన చేశారు. మొగల్తూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన ఆందోళనలో సీపీఎం మండల కార్యదర్శి వై.చిట్టిబాబు మాట్లాడుతూ ఆదర్శనగర్ కాలనీలో డ్రెయిన్ నీరు వేళ్లే మార్గం లేక ఇళ్ల ముందే నీరు నిలిచి కాలనీ వాసులు వ్యాధులకు గురవుతున్నారన్నారు. సర్పంచ్, పంచాయతీ పాలకవర్గం స్పందించి పక్కా డ్రెయిన్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. కె.సాయి, ఎం.బుల్లియ్య, పి.రాజారత్నం, వి.కృష్ణ, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను మంజూరు చేయండి

భీమవరం అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్నల్లోని టిడ్కో ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. మెంటేవారితోట సుందరయ్య భవనంలో సోమవారం సీపీఎం పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. టిడ్కో ఇళ్ల కోసం లబ్ధిదారులు లక్షల రూపాయల అప్పులు చేసి ప్రభుత్వానికి చెల్లించి పదేళ్ల దాటిన ఇంతవరకు ఇళ్లు మంజురు చేయకపోవడం దారుణమన్నారు. పాత బస్టాండులో అల్లూరీ సీతారామ రాజు మెమోరియల్ నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఆకీవీడు అయి భీమవరం రోడ్డులో దశాబ్దలుగా రోడ్డుప్రక్క నివాసం ఉంటున్న పేదల ఇళ్ళను అక్రమంగా కుల్చివేయడం దారుణమని బలరాం అన్నారు. కూల్చిన ఇళ్ళకు నష్టపరిహారం స్థలాలు, ఇళ్ళు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు జేఎన్‌వీ గోపాలన్, వాసుదేవరావు, వైకుంఠరావు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక కష్టాలు

మృతదేహాన్ని తరలించాలంటే నానాపాట్లు పడాల్సిందే

పాలకోడేరు, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): గొల్లలకోడేరు శివారు గుబ్బలవారిపాలెం, సొడిగుళ్లవారి పాలెం, తుమ్మలగుంటపాలెం వాసులకు ఎవరైన మరణిస్తే ఆ మృతదేహాలను తరలించేందుకు పెద్దయుద్ధమే చేయ్యాల్సిన పరిస్థితి. గొల్లలకోడేరు పంచాయతీ పరిధిలోని ఈ మూడు పాలాల్లో 1500 మంది జనాభా నివాసిస్తున్నారు. ఈ మూడు పాలెలకు కలిపి ఇటు తుమ్మకుంటపాలెం అటు సూడుగుళ్ళ వారిపాలానికి మధ్యలో పంట పొలాలకి మధ్యలో వీరికి చెందిన శ్మశానవాటిక ఉంది.

ఈ శ్మశానవాటికకు వెళ్లాలంటే ఎటు నుం చి అయిన పంట పొలాల మధ్య నుంచి అరకిలో మీటరు నడకదారిన మృతదేహాన్ని తీసుకెళ్లాల్సిందే. ఒకప్పుడు స్మశానవాటికకు వెళ్లేగట్టు మూడు నుంచి నాలగు అడుగులు ఉండేదని ప్రస్తుతం అడుగుకూడా లేకపోవడంతో మృతదేహాన్ని తీసుకెళ్లాలి అంటే నరకం చూస్తున్నామని వాపోతున్నారు. మృతదేహాన్ని కాల్చేందుకు కట్టెలను సైతం ఎవరికివారు మోసుకొని వెళ్లాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం స్పందించి శ్మశానవాటికకు వెళ్లేందుకు రోడ్డు ఏర్పాటు చేసి తమ కష్టాలను తీర్చాలని వారు కోరుకుంటున్నారు.

గ్రామం ఏర్పడిన నాటి నుంచి ఇవే కష్టాలు

గుబ్బలవారిపాలెం, తుమ్మగుంటపాలెం, చోడిగూడెంవారిపాలెం గ్రామాలు ఏర్పడిన నాటి నుంచి సుమారు 50 ఏళ్లుగా ఇదే శ్మశానవాటికను ఉపయోగించుకుంటున్నామని గ్రామస్థులు తెలిపారు. అప్పటి నుంచి తమకు ఇవే కష్టాలు. ఎవరైన చనిపోయారంటే ఆ మృతదేహాన్ని తీసుకెళ్లేందుకే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. పొలాల మధ్య ఉన్నగట్ల మీద అడుగులో అడుగు వేసుకుంటు మృతదేహాన్ని తీసుకెళ్ళాల్సిన పరిస్థితి. ప్రజాప్రతినిధులు, అధికారులు తమ సమస్యలు గుర్తించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



గొల్లలకోడేరు శివారులో పంట పొలాల మధ్యలో నుంచి అంత్యక్రియలకు తీసుకెళ్తున్న స్థానికులు

ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం

ఎమ్మెల్యే రఘురామ, కలెక్టరు నాగరాణి

ఉండి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలను పరిరక్షించడంలో ప్రభుత్వం కృషి చేస్తుందని ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణ రాజు, కలెక్టరు చదలవాడ నాగరాణి అన్నారు. ఉండి తహసీల్దారు కార్యాలయం పక్కనే వున్న భవనంలో పోలీస్‌స్టేషన్‌ని ఏర్పాటు చేసి సోమవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే రఘురామ, కలెక్టరు నాగరాణి విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు అండగా ఉండడానికి పోలీస్ వ్యవస్థ అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా ఎస్పీ అస్మిన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలతో ప్రజలకు అవసరమైన సేవలను అందించడానికి పూర్తిస్థాయిలో ప్రయత్నిస్తామన్నారు. ఈ సందర్భంగా ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజును అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. నరసాపురం పార్లమెంట్ బీజేపీ కన్వీనరు పేరిచర్ల శ్రీనివాస రాజు(సుబాష్), జనసేన ఇన్‌చార్జి జుత్తుగ నాగ రాజు, మంతెన పెద నరసింహరాజు, ఎంపీపీ ఇందుకూరి హరిబాబు, కొత్తపల్లి నాగరాజు, మండల టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు కరిమెరక నాగరాజు, కిన్నెర వెంకన్న, ఎంటీటీసీ కునుకు రమాదేవిశ్రీను, పోలీస్ అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉండి పోలీస్‌స్టేషన్‌ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘురామ, చిత్రంలో కలెక్టరు నాగరాణి, ఎస్పీ అస్మిన్

జనసేనలోకి వైసీపీ నేతలు

గణపవరం, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): అర్ధవరంలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సమక్షంలో మండలంలోని వివిధ గ్రామల నుంచి 150 మంది వైసీపీ నాయకులు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. గణపవరం సర్పంచ్ మూరా అలంకారం, అప్పన్నపేట మాజీ సర్పంచ్ నూకారపు మల్లేశ్వరరావు, కాశీపాడు సర్పంచ్ తెర్లి నాగరాజు, సహస్ర కన్‌స్ట్రక్షన్స్ అధినేత పెనుమత్స నారాయణరాజు, వైసీపీ మండల ప్రచార కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, తదితరులకు ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లు పార్టీ నాయకులను జనసేన పార్టీలోకి ఆహ్వానిస్తున్న ధర్మరాజు

క్రైం కార్నర్

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

భీమవరం క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తన భర్త గత నెల 16వ తేదీ నుంచి కనిపించడం లేదంటూ దుర్గాపురానికి చెందిన గొల్పులు మావుళ్ల టూ టౌన్ పోలీసులకు సోమవారం పిర్యాదు చేశారు. ఏఎస్‌ఐ నర్సింహస్వామి తెలిపిన వివరాలు ప్రకారం మావుళ్లకు మహేష్ అనే వ్యక్తితో 11ఏళ్ల క్రితం వివాహమైంది. అతను ఒక వాటర్ సప్లై కంపెనీలో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. గత నెల 16న పనికి వెళ్లి తిరిగిరాలేదు. వాటర్ సప్లై కంపెనీ యజమాని అడగగా అసలు అప్పటి నుంచి పనిలోకి రాలేదని చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

భార్యపై భర్త దాడి

తన భర్త కర్రతో దాడి చేశారంటూ భీమవరం మండ లం చినఅమిరం గ్రామానికి చెందిన బి.సుమలత టూ టౌన్ పోలీసులకు పిర్యాదు చేశారు. వివాహమై 15 సంవత్సరాలు అయ్యిందని అయితే మద్యానికి బానిసైన తన భర్త రవికుమార్ ఈ నెల 3 న బాగా మద్యం తాగి వచ్చి కర్రతో దాడి చేశాడని ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రహమాన్ తెలిపారు.

మోసం చేశారని ఫిర్యాదు

తనకు లోన్ ఇప్పిస్తానని నమ్మించి తనకు తెలియకుండానే వేరే బ్యాంక్‌లో లోన్ తీసుకుని మోసం చేశారంటూ అత్తిలి మండలం బల్లిపాడు గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు భీమవరం టూ టౌన్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ రహమాన్ తెలిపిన వివరాలు ప్రకారం శ్రీనివాసరావుకు అవసరాలు నిమిత్తం గతంలో తణుకులోని కర్ణాటక బ్యాంక్‌లో రూ.4 లక్షలు లోన్ తీసుకున్నారు. అయితే కూతురు వివాహం నిశ్చయం కావడంతో మళ్ళీ ఆ బ్యాంకుకు వెళ్ళి టాప్ అప్ కావాలని అడగ్గా అక్కడ పరిచమైన ఫైడిమర్రుకు చెందిన రమణ, రాజు అనేవారు ఇక్కడ మళ్లీ లోన్ ఇవ్వరని తాము లోన్ ఇప్పిస్తామని నమ్మించి భీమవరం తీసుకు వచ్చి ఫెడరల్ బ్యాంక్‌లో అకౌంట్ తీయించారు. పాస్‌బుక్ ఒరిజనల్ మాత్రం లోన్ వచ్చాక ఇస్తామని నమ్మించి వారిద్దరి దగ్గర ఉంచుకున్నారు. ఇక్కడ వరకు బాగానే ఉన్నా గత నెల 27న శ్రీనివాసరావుకు హైదరాబాద్, రాణిగంజ్, యాక్సెస్ బ్యాంక్ నుంచి ఫోన్ వచ్చింది. ఐదు నెలల వాయిదాలు బాగానే చెల్లించారు. కదా ఈనెల వాయిదా ఇంకా చెల్లించలేదంటూ వారు మాట్లాడారు. దీంతో కం గుతిన్న శ్రీనివాసరావు ఆరా తీయగా రూ.9 లక్షలు లోన్ తన పేరు మీద ఉన్నట్లు నిర్ధారణ అయ్యి ంది. దీంతో మోస పోయానని తెలుసుకుని భీమవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

పాలకొల్లు అర్బన్, వవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎల్ఆర్‌పేట మాంటిస్సోరీ స్కూల్ ఆవరణలో సోమవారం పట్టణ జేఏసీ ఆధ్వర్యంలో విద్యార్థులు 120 మొక్కలు నాటారు. స్కూల్ డైరెక్టర్ కేవీ కృష్ణ వర్మ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలన్నారు. ప్రీప్రైమరీ విద్యార్థులు మొక్కల వేషధారణ ఆకర్షణీయంగా నిలిచింది. జేసీఐ కో ఆర్డినేటర్ కౌషిక్, ప్రిన్సిపాల్ ఎస్పీఎస్ ప్రకాశరావు, ఇన్‌చార్జి బి.శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

● ఉండి : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని ఉండి లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ఎం.శివరామరాజు, క్లబ్ ఉపాధ్యక్షుడు జి.రంగ రాజు అన్నారు. ఉండి రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛభారత్ కార్య క్రమం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రైల్వే ప్లాట్‌ఫారంపై పెరిగిన పిచ్చి మొక్కలను తొలగిం చి శ్రమదానం చేసినట్లు వారు తెలిపారు. జి.వెంక టేశ్వరరాజు, జి.రాము, బి.హరినాద్ రాజు, స్టేషన్ సూపర్‌టెండెంట్ కుమార్ పాల్గొన్నారు.

కోడిపందాల దిబ్బ కాలనీలో రోడ్లు వేయండి

పెనుగొండ, నవంబరు4(ఆంధ్రజ్యోతి): రోడ్లు, తాగునీరు, వీధి లైట్లు, మౌలిక వసతులు కల్పించాలని కోరుతు కోడిపందాల దిబ్బ కాలనీ ప్రజలు తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. పలువురు మహిళలు మాట్లాడుతూ వీధి లైట్లు వేసి, ఇంత వరకు విద్యుత్ సౌకర్యం కల్పించలేదన్నారు. రోడ్లు మునిగి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలు సార్లు తెలిపినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం ఎంపీడీవో సూర్యనారాయణమూర్తికి వినతిపత్రం అందజేశారు. కాలనీ వాసులు జి.వాణి, వీరవల్లి లక్ష్మి, పద్మ, శకుంతల, జ్యోతి, సీపీఎం నాయకులు మాదాసు నాగేశ్వరరావు, నాగిశెట్టి గంగారావు పాల్గొన్నారు.

కిటకిటలాడిన శైవక్షేత్రాలు

పరమేశ్వరునికి భక్తిశ్రద్ధలతో పూజలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

తొలి కార్తీక సోమవారం జిల్లాలోని శైవ క్షేత్రాలు శివనామస్మరణంతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు పుణ్యస్నానాలు చేసి కార్తీక దీపాలు వెలిగించారు. నరసాపురం పట్టణంలోని అమరేశ్వర, శివాలయాల్లో భక్తులు పోటెత్తారు. ఆకివీడు మాదివాడ మల్లేశ్వరస్వామి, వాడపల్లివీధిలో అగస్తేశ్వరస్వామి, రెడ్డివీధిలో మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, తదితర ఆలయాల్లో భక్తులు పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు పెంటపాడు పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.లక్ష్మణరెడ్డి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని ఏలూరు కాలువను ఆనుకొని ఉన్న శివాలయంలో మహిళలు పూజలు చేశారు. వీరంపాలెం శ్రీబాలాత్రిపుర సుందరి పంచాయతన క్షేత్రంలో స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఆచంట ప్రసిద్ధి చెందిన ఆచంటేశ్వరుని ఆలయం శివనామస్మరణతో హోరెత్తింది. ఈవో ఏవీ సత్యనారాయణ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మొగల్తూరు మండలంలోని ముత్యాలపల్లిలోని భువనేశ్వరీ సమేత ముక్తేశ్వరస్వామి ఆలయం, పేరుపాలెం, కేపీ పాలెం గ్రామాల్లోని చంద్రమౌళేశ్వరస్వామి ఆలయాలు, కాళీపట్నం కాళికేశ్వరస్వామి, మొగల్తూరులోని పురాతన పార్వతీ విశ్వేశ్వరస్వామి, వడయార్‌పేటలోని స్వయంభూ లింగేశ్వర వనమల్లిఖార్జున స్వామి ఆలయాల్లో అభిషేకాలు నిర్వహించారు. నరసాపురం పట్టణంలో ప్రసిద్ధిగాంచిన ఏకాంబేశ్వరస్వామి ఆలయంలో వేదపండితులు అభిషేకం చేస్తున్న సమయంలో ఆలయం వద్ద ఓ అంబోతు వచ్చింది. పూజా, అలంకరణ అయ్యే వరకు అక్కడే ఉంది, ఉండి మండలంలో మహిళలు భక్తితో పూజలు నిర్వహించారు. యలమంచిలి ఉమాసోమేశ్వరస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో చేశారు. పెనుమంట్ర మండలం ప్రముఖ పుణ్యక్షేత్రాలైన నత్తా రామేశ్వరంలోని రామేశ్వరస్వామి ఆలయం జుత్తిగలోని ఉమా వాసుకి రవి సోమేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కాళ్ల మండలం కాళ్ళకూరలోని పార్వతి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో దాట్ల శ్రీదేవి ట్రస్టు ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్టు అధినేత దాట్ల వెంకటరామరాజు, అడ్డాల నాగరాజు, చేకూరి పుల్లంరాజు, భక్తులు పాల్గొన్నారు. పెనుగొండ మండలం సిద్ధాంతం వశిష్ట గోదావరి తీరాన ఉన్న ప్రసిద్ధ శ్రీకేదారేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పెనుగొండ వాసవి మాత ఆలయం , చెరుకువాడలో శ్రీఉ మా విశ్వేశ్వర స్వామి ఆలయాలు శివనామ స్మరణలతో మారుమోగాయి. గణపవరంలోని సువర్ణేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారు జాము నుంచే భక్తులు పూజలు, అభిషేకాలు నిర్వహించుకున్నారు. పాలకొల్లు పంచారామ క్షేత్రమైన క్షీరా రామలింగేశ్వర స్వామిని దర్శించుకు నేందుకు వచ్చే భక్తులకు పలు సేవా సంస్థలు అల్పాహారం, అన్నప్రసాదం, బాదం పాలు, మంచినీళ్ల అందజేశారు.



పెంటపాడులో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

దాతల సహకారం అభినందనీయం

తాడేపల్లిగూడెం అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధిలో దాతల సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ప్రత్తిపాడు పంచాయతీకి రైస్ మిల్లర్ గోదాము యజమానులు అందజేసిన ట్రాక్టర్‌ను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి సమస్య పరిష్కరిస్తానన్నారు. కూటమి నాయకులు చెరుకూరి జగత్ సోమశేఖర్ (పండు), వీర్ల కృష్ణ, మజ్జి అప్పారావు, మట్టా రాంబాబు, ఆరాద్యుల అంజి పాల్గొన్నారు.



ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

ఏడు కోట్లకు పైగా గ్రావెల్ దోచుకున్న కొట్టు

తాడేపల్లిగూడెం రూరల్ : ఆరుగొలను క్వారీ లారీ యజమానులను బ్లాక్‌మెయిల్ చేసి రూ. ఏడు కోట్లకు పైగా గ్రావె ల్‌ను దోచుకుని బినామీ రామాంజనేయులు పేరు న బిల్లు పెట్టుకున్న ఘనుడు కొట్టు సత్యనారా యణ అని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ విమర్శిం చారు. ఆరుగొలనులో రూ.37.50 లక్షలతో నిర్మిం చే బీటీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కోట్లు దోచుకున్న వ్యక్తి తమపై విమర్శ లకు దిగడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సర్పంచ్ పీతల బుచ్చిబాబు, జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్, చెరుకూరి జగత్ సోమశేఖర్, బీజేపీఈ నాయకులు చిక్కాల చిరంజీవి, అడపా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బొలిశెట్టిని విమర్శించే స్థాయి కొట్టుకు లేదు

తాడేపల్లిగూడెం అర్బన్ : నిస్వార్థంగా పనిచేసే ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ను విమర్శించే స్థాయి మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణకు లేదని ఆర్యవైశ్య సంఘం పట్టణ గౌరవాధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని జనసేన కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మారం మాట్లాడుతూ టీడీఆర్ బాండ్ల విషయంలో రూ.కోట్లు దండుకున్నారని ఆరోపించారు. జనసేన నాయకుడు వి.వెంకటేశ్వర రావు మాట్లాడుతూ మరోసారి ఎమ్మెల్యేపై విమర్శలు చేస్తే కొట్టు వల్ల నష్టపోయిన బాధితులందరినీ తీసుకుని ఆయన ఇంటి వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పట్టణ, రూరల్, పెంటపాడు అధ్యక్షులు వర్తనపల్లి కాశి, అడపా ప్రసాద్, పుల్లా బాబి, గుండుమోగుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మిగిలింది రెండు రోజులే

నరసాపురం/కాళ్ళ/ఆచంట/పాలకొల్లు అర్బన్/ మొగల్తూరు/పెంటపాడు/ యలమంచిలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు మరో రెండు రోజుల్లో ముగుస్తుంది, అర్హులంతా ఓటు నమోదు చేసుకోవాలంటూ సోమవారం కూటమి నాయకులు ప్రచారం చేశారు. బీజేపీ కన్వీనర్ ఎం.సతీష్, మాజీ వీసీ పి.నాగబాబు, జి.శ్రీమన్నారాయణ, కె.వెంకటేశ్వ రావు, ఎం.వెంకటేశ్వరావు పాల్గొన్నారు. గ్రాడ్యుయేట్లు ఈ నెల ఆరో తేదీలోగా ఓటు నమోదు చేసుకోవాలని కాళ్ళ ఆచంట, పాలకొల్లు, పెంట పాడ, మొగల్తూరు, యలమంచిలి తహసీల్దార్లు జి.సుందర్‌సింగ్, బి. కనకరాజు, వై.దుర్గా కిషోర్, కె.రాజ్ కిషోర్, ఎ.శ్రీనివాస్, జి.పవన్‌కుమార్ తెలిపారు. అర్హులంతా తమ సర్టిఫికెట్లతో ఆన్‌లైన్ ద్వారా గాని, లేదా తహసీల్దార్, మండల పరిషత్, ఎంఈవో కార్యాలయాల్లో నేరుగా నమోదు కావాలన్నారు.

పంట కాలువ పరిశీలన

ఆచంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శివారు ప్రాంతాలకు సాగునీరు పూర్తిస్థాయిలో నీరు అందకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. ఈ తరుణంలో వల్లూరు, వేమవరానికి సంబంధించిన రైతులు కొంత మంది తమ పంట పొలాలకు నీరు అందక కష్టాలు పడుతున్నామని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరిగేషన్ డీఈ సీహెచ్ వెంకటనారాయణ, కొడమంచిలి వల్లూరు కాలువకు సంబంధించి పంట కాలువను సోమవారం పరిశీలించారు. త్వరలోనే అన్ని కాలువలకు పూర్తిస్థాయిలో సాగునీరు సరఫరా అవుతుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతులు పాల్గొన్నారు.

ప్రజ్ఞ టెక్నికల్ ఫెయిర్

భీమవరం ఎడ్యుకేషన్, నవంబరు 4 (ఆంధ్ర జ్యోతి): గ్రామీణ విద్యార్థులు కూడా జాతీయ స్థాయిలో జరిగే నూతన ఆవిష్కరణలు అధ్యయనం చేయాలని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు అన్నారు. వెంపలో ఉన్న జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రజ్ఞ టెక్నికల్ ఫెయిర్ నిర్వహించారు.ఇటీవల తమ కళాశాల విద్యార్థులు మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జాతీయ స్థాయిలో నిర్వహించిన అణువుగాని ప్రదేశాలలోనైనా నడపగలిగిన వాహనాలు డిజైన్, రేసిం గ్ పోటీల్లో రెండో స్థానంలో నిలిచారన్నారు. పూర్వ విద్యార్థి అయిన ప్రిన్సిపాల్ మురళీకృష్ణంరాజును సత్కరించారు. కె.రామచంద్రరాజు, కె.అప్పలరాజు, వి.రమణరాజు, ఎన్‌వీ సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఈ నీరు తాగ లేకున్నాం



ఆకివీడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రజలకు నగర పంచాయతీ సరఫరా చేసే తాగునీరు దుర్వాసనతో వస్తుండడంతో మహిళలు ఆగ్రహిస్తున్నారు. ఆరో వార్డులోని పెద్దింట్లమ్మ దేవస్థానం వీధిలో సోమవారం కుళాయి నుంచి వస్తున్న మంచి నీరును మహిళలు చూసి అవాక్కయ్యారు. తాగునీరు కలుషితమవుతుందని ఎమ్మెల్యేకి చెప్పుతున్నా సంబంధిత అధికారులకు చీమకుట్టినట్టుగా కూడా లేదు. ఈ వార్డులో కూలి పని చేసుకొనే వారే అందరూ. డబ్బులతో బయట కొనుగోలు చేసు కోనే స్థోమత లేనివారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు.

అవినీతి దేశాన్ని నాశనం చేస్తుంది

భీమవరం టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : అవినీతి దేశాన్ని నాశనం చేస్తుందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భీమవరం బ్రాంచ్ చీఫ్ మేనేజర్ నిర్మల జ్యోతి అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకుని సర్ సీవీ రామ న్ స్కూల్లో శ్రీవిజ్ఞాన వేదిక, యూనియన్ బ్యాంక్, సర్ సీవీ రామన్ స్కూల్ ఆధ్వర్యంలో అవినీతి నిరోధక అవగాహన వారోత్సవాల్లో భాగంగా విద్యా ర్థులకు పోటీలు నిర్వహించారు. బ్యాంక్ విజిలెన్స్ అధికారి రమేష్, స్కూల్ డైరెక్టర్ ఆర్.వేణు గోపాల రావు, ప్రిన్సిపాల్ పి.సరిత, రంగసాయి పాల్గొన్నారు.

ఆరోగ్యమే సమాజాభివృద్ధికి మూలం

తాడేపల్లిగూడెం అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే సమాజ అభివృద్ధికి మూలమని ఏపీ నిట్ డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ జీబీ వీరేష్‌కుమార్ అన్నారు. నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఏపీ నిట్‌లో వాక్‌థాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలంటే తప్పనిసరిగా నడవాలన్నారు. అనంతరం విద్యార్థులతో ఐక్యత ప్రతిజ్ఞ చేయించారు.

వార్డుల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి



తణుకు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వార్డు ఇన్‌చార్జ్‌లు వార్డుల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. పట్టణంలోని 34 వార్డులకు 44 మందిని ఇన్‌చార్జిలుగా సోమవారం నియమించారు. 1వ వార్డుకు చిట్యాల రంగారావు, రెండో వార్డుకు తమరాపు పల్లపరావు, కంటిపూడి రాంబాబు, మూడో వార్డుకు గుబ్బల శ్రీను, 4కి ఎలుబూడి ఈశ్వర రావు, జక్కంశెట్టి వెంకటేష్, 5కి తణుకు రేవతి, 6కి సిర్రా సుధాకర్, అబ్బుదాసరి రాజారావు, 7కి ఊట రామకృష్ణ, కుటికుప్పల జయమ్మ, 8కి చిన సత్యనారాయణ, కోన రాధాకృష్ణ, 9కి సానబోయిన రామకృష్ణ, 10కి నాయుడు లావణ్య, 11కి తమరాపు రమణమ్మ, 12కి బట్టపల్లి నాగరాజు, 13కి పచ్చిపాల మృత్యుంజయరావు, నత్త శేఖర్, 14కి చిట్టూరి సాయిబాబా, 15కి ముళ్లపూడి ప్రసాద్, రాజులపాటి శ్రీనివాసు నియమితులయ్యారు. అలాగే 16కి మేడిచర్ల భాను ప్రసాదు, 17కి ఆకుల వెంకటేష్, 18- సప్పా వీర రాఘవులు, 19కి దూలం విక్రమ్, 20- తాతపూడి మారుతీరావు, గమిని రామచంద్రరావు, 21కి చింతలపూడి సన్యాసిరావు, 22కి కీర్తి శివప్రసాదు, 23కి మల్లిన రాధాకృష్ణ, 24కి మరోతి వెంకటేశ్వరరావు, 25కి గూడవల్లి జయలక్ష్మి, 26కి మాదాసు రాంబాబు, 27కి కొప్పాల ఇందిరాదేవి, 28కి గండి రామకృష్ణ, 29కి కె.హరినాథ్, 30కి కొమ్మిరెడ్డి రమాదేవి, 31కి పితాని గణేష్, 32కి చినిమిల్లి ప్రసాదు, ములగాల శ్రీనివాసు, 33కి ఒంటెద్దు రాజా, మోపిదేవి శివ, 34కి సిరిమల్లె సాంబశివరావును నియమించినట్లు తెలిపారు.

ఫ్రీజర్ బాక్స్ అందజేత



యలమంచిలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్వర్గీయ తాళ్లూరి సుబ్బారావు, గంగమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు శ్రీనివాసు(వైజాగ్ బుజ్జి) రూ.99 వేలు విలువచేసే ఫ్రీజర్ బాక్స్‌ను యలమంచిలి గ్రామానికి సమకూర్చారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో టి.శ్రీనివాసు సమకూర్చిన ఫ్రీజర్ బాక్సును తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు టి.సత్యశ్రీను, తెలుగు యువత మండల అధ్యక్షుడు బి.రాంబాబు చేతులమీదుగా సర్పంచ్ బి.మేరీ, కార్యదర్శి జి.గంగన్నకు అందజేశారు. సర్పంచ్ మేరీ మాట్లాడుతూ శ్రీనివాసు ఏడాది క్రితం పంచాయతీకి సుమారు రూ.3 లక్షలు విలువచేసే ట్రాక్టర్‌ను, ఇప్పుడు ఫ్రీజర్ బాక్సును అందించడం స్ఫూర్తిదాయకమన్నారు. బి.ప్రసాద్, ఎస్.శ్రీనివాస్, సీహెచ్ శ్రీనివాస్, ఎ.ఏసు, కె.విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఆరు వేల సభ్యత్వాలు పూర్తి



సభ్యత్వాన్ని అందజేస్తున్న పొత్తూరి

నరసాపురం టౌన్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఆరు వేల సభ్యత్వాలను నమోదు చేసినట్లు టీడీపీ ఇన్‌చార్జి పి.రామరాజు తెలిపారు. పట్టణంలోని 8వార్డులో సోమవారం సభ్యత్వ కార్డులను ఆయన అందజేశారు. అనుకున్న టార్గెట్‌ను పూర్తి చేసే దిశగా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. జి.శ్రీమన్నారాయణ, కె.పెద్దిరాజు, కె.రవి, తదితరులు పాల్గొన్నారు.

● గణపవరం : పిప్పరలో టీడీపీ ఈ-సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి యాళ్ళ సుబ్బారావు చేపట్టారు. డిజిటల్‌గా నమోదు చేసిన సభ్యత్వాలను కార్యకర్తలకు అందజేశారు. సభ్యత్వ నమోదుతో రూ.5లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని ఆయన చెప్పారు.